

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 357 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 23, నవంబర్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# పతనావస్థలో.. ప్రజాస్వామ్యం !



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, ఛైర్మన్

ప్రజాస్వామ్యంలో ప్రజలు మాత్రమే నష్టపోతున్నారు

ప్రజలను కాపాడుకోలేకపోతున్న ప్రజాస్వామ్యవాదులు

నమ్మించి మోసం చేయడం రాజకీయ నాయకులకు కొత్తేం కాదు

కేంద్ర ప్రభుత్వం తీరు పట్ల దేశంలో పెరుగుతున్న వ్యతిరేకత

రాజకీయ ఒత్తిడికి లోనవుతున్న న్యాయస్థానాలు

ప్రపంచ దేశాలకు పాకుతున్న ప్రజాస్వామ్య అణిచివేత


స్వతంత్రంగా జీవించాల్సిన వ్యక్తులు అణచివేయబడుతున్నారు

ప్రజలను విసుగెత్తించడమే ప్రభుత్వాలు పనిగా పెట్టుకున్నాయి

ప్రజాస్వామ్యంపై గౌరవం లేనివానికి దేశంపై గౌరవం ఉండదు


రాజకీయ శక్తులన్నీ లోలోపల ఒకటవుతున్నాయి

డాక్టర్ బరిగెల శివ



భారత ప్రజాస్వామ్యం ప్రస్తుతం పతనావస్థలో ఉందని, ప్రజల రక్షణ కోసం పుట్టిన ఈ వ్యవస్థ రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాలకు బలైపోతోందని ప్రముఖ దళిత ఉద్యమకారుడు డాక్టర్ బరిగెల శివ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రాల వరకు అన్ని ప్రభుత్వాలూ ప్రజాస్వామ్య విరోధ ధోరణులను అనుసరిస్తూ, ఉగ్రవాద దాడులను అడ్డుకోలేకపోతూ, ప్రజల భద్రతను గాలికొదిలేస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. మీడియా బాధ్యతను విస్మరించి ప్రభుత్వాల గుండెలో చేరిపోయిందని, సోషల్ మీడియా మాత్రమే నిజాయితీతో నిలబడుతోందని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలది, ప్రజాస్వామ్యవాదులది అని స్పష్టం చేస్తూ రాజకీయ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు. - జై భీమ్ న్యూస్ డెస్క్, హైదరాబాద్

2



## పెన్నే కదాని తృణీకరిస్తే గన్నై కూల్చింది




3

కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం

ఉద్యమకారులను నాటి పాలకులు విస్మరించారు

చదువుకోని అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు

ఆయన లేకుండా తెలంగాణ ఉద్యమసభలు లేవు

అందెశ్రీ సంస్మరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

## పుట్టపర్తి చేరుకున్న ఉపరాష్ట్రపతి

ఘనంగా స్వాగతం పలికిన సిఎం, మంత్రులు

3

## సత్యసాయి ఆశిస్సులతో అగ్రస్థానానికి భారత్

సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి

సాయి సమాధి వద్ద నివాళి అర్పించిన రాధాకృష్ణన్

3




## అన్నపూర్ణ స్టూడియోను సందర్శించిన భట్టి

6

ఫల్మ్, మీడియాలో విద్యార్థుల సృజనాత్మకతకు ఫిదా

అక్కినేని నాగార్జున దంపతుల పట్టుదలకు అభినందన

## మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్

వరుస ఎన్‌కౌంటర్ల తరవాత 37మంది లొంగుబాటు

లొంగిపోయిన వారిలో కేంద్రకమిటీ సభ్యులు ఆజాద్

గణపతి తదితరులంతా అజ్ఞాతం వీడి రావాలన్న డిజిపి

2



# విశ్వప్రేమకు ప్రతిరూపం సత్యసాయి

**సాయి బోధనలు లక్షల మందికి మార్గనిర్దేశనం**

**పుట్టపర్తి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము**



**పుట్టపర్తి,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

సత్యసాయి మహాసమాధిని దర్శించుకోవడం తన అదృష్టమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నిర్వహించిన శ్రీసత్యసాయి శత జయంతి వేడుక ల్లో ఆమె పాల్గొన్నారు. సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న అనతంరం రాష్ట్రపతి ప్రసంగించారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. ఆయన బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. ఆయన సందేశంతో కోట్ల మంది భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపు తున్నానని రాష్ట్రపతి అన్నారు. పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలు ఎంతోమందని ప్రభావితం చేశాయని అన్నారు. లక్షలాది మందికి మార్గం చూపాయని వ్యాఖ్యానించారు. పుట్టపర్తికి వచ్చిన రాష్ట్రపతికి సీఎం, మంత్రులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పుట్టపర్తిలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముర్ము పాల్గొన్నారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారని కొనియాడారు. బాబా సందేశంతో కోట్లాదిమంది భక్తులు మానవ సేవ చేస్తున్నారని ప్రశంసించారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారని కీర్తించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు ఆమె వెంట ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు. అంతకుముందు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి చంద్రబాబు, లోకేశ్ ఘన స్వాగతం పలికారు.

# దక్షణ అండమాన్ మధ్యలో అల్పపీడనం

**ఎపికి వాతావరణ శాఖ భారీ వర్ష సూచన**

**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**

**అమరావతి,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

మలక్కా- దక్షిణ అండమాన్ సముద్రం మధ్య అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణించి ఈ నెల 24న ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వాయుగుండం మరింత బలపడే సూచనలు ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. 48 గంటల్లో రాయలసీమ, దక్షిణకోస్తాలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, కడప, జిల్లాల్లో తేలికపాటి వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.ఇటీవల మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. అనేక జిల్లాల్లో వర్ష బీభత్సం కొనసాగింది. ఆ పరిస్థితులను నుంచి ప్రజలు కోలుకుంటున్న తరుణంలో మరోసారి వర్షాలు ఏపీని ముంచెత్తనున్నాయి. ఉపరితల ఆవర్తన ప్రభావంతో దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇది పశ్చిమ - వాయవ్య దిశగా కదులుతూ ఈనెల 24 సోమవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తరువాత 48 గంటల్లో పశ్చిమ - వాయవ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో ఈనెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్షాలు రానున్న నేపథ్యంలో రైతులకు విపత్తుల నిర్వహణ సంస్థ పలు ముఖ్య సూచనలు చేసింది. ప్రస్తుతం వరి కోతలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో రైతులు వెంటనే కుప్పలు వేసుకోవాలని తెలిపింది. పండిన ధాన్యాన్ని వర్షంలో తడవకుండా సురక్షితంగా భద్రపరచుకోవాలని సూచించింది. ధాన్యం తడిసి రంగు మారకుండా ఉండేందుకు పూర్తిగా పట్టాలతో కప్పి ఉంచాలని పేర్కొంది. తడిసిన గింజలు మొలకెత్తకుండా, నాణ్యత కోల్పోకుండా జాగ్రత్త పడాలని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ సూచనలు చేసింది.

# ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అర్బన్ ఫామింగ్ ట్రైనింగ్

**హైదరాబాద్,నవంబర్22(జై భీమ్ న్యూస్) :**

తెలంగాణ ఉద్యానశిక్షణ కేంద్రం ఆధ్వర్వంలో అర్బన్ ఫామింగ్ పథకం కింద హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలలో ఇంటి ఆవాసాలు, బాల్కానీలపై కూరగాయాల పెంపకంపై ఈనెల 23న శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు కొనసాగుతుందని, ఆసక్తి గలవారు ఫీజు రూ. 100/ చెల్లించి నేరుగా హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు అర్బన్ ఫామింగ్ విభాగము పబ్లిక్ గా÷-డర్గ÷న్, నాంపల్లి, హైదరాబాద్ లేదా ఫోన్ : 8977714411/8688848714ను సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు.

# పతనావస్థలో ప్రజాస్వామ్యం

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

ప్రజాస్వామ్యం బాగుంటేనే భారతదేశం బాగుంటుందని, ప్రజాస్వామ్యాన్ని పతనం చేయడమే ప్రతినిధులు పనిగట్టుకున్నట్లుగా దేశ పాలన సాగుతూ ఉందని డాక్టర్ బరిగెల శివ అన్నారు. భారతదేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలోనికి నెట్టివేయబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధి విధానాలను అన్ని రాష్ట్రాలు ఆచరిస్తూ అనుసరిస్తున్నాయని, దానివల్లనే ప్రజాస్వామ్యానికి రక్షణ లేకుండా పోతుందన్నారు. దేశంలో పెరిగిపోతున్న ఉగ్రవాద దాడులను అరికట్టాల్సిన కేంద్ర ప్రభుత్వం దాడులు పెరిగిపోతుండగా దేశ భద్రతను గాలికి వదిలేస్తుందన్నారు. ప్రజలు ప్రజాస్వామ్యవాదులు వాళ్ల రక్షణ కోసం ప్రభుత్వాలను ఎన్నుకోవాల్సి ఉంటుండగా, ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజలను కాపాడాల్సిన బాధ్యతను పూర్తిగా విడమరచుకుంటున్నాయని విమర్శించారు. ప్రస్తుతం భారతదేశంలో ఎక్కడ చూసినా ప్రజల బ్రతుకులకు రక్షణ లేకుండా పోతుందని, దానివల్ల ప్రజాస్వామ్యం అత్యంత దయనీయ స్థితిలోనికి నెట్టివేయబడుతుందన్నారు. రాజకీయ పార్టీలకు ఎన్నికలు అనగానే ప్రజలపై ఎక్కడ లేని ప్రేమానురాగాలు పొంగిపొర్లుతున్నాయన్నారు. దేశంలో ఉగ్రవాద దాడులు పెరిగిపోవడానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లనే ప్రజాస్వామ్యం అణచివేయబడుతుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యతిరేకవాదులకు ప్రభుత్వాల సహకారం మెండుగా లభిస్తుందని, దానివల్ల కూడా ప్రజాస్వామ్యం పతనావస్థకు చేరిపోతుందన్నారు. ప్రజాస్వామ్యం అనేది నిర్మించబడినది ప్రజల రక్షణ కోసమే గాని రాజకీయ నాయకుల రక్షణ కోసం కాదన్నారు. బలవంతులైన రాజకీయ నాయకులు బలహీనులైన పేదలను అభివృద్ధి పరచకపోవడం కూడా ప్రజాస్వామ్య అణిచివేతలో భాగమేనన్నారు. దేశంలో ఎక్కడ చూసినా అణచివేత కొద్దీ తిరుగుబాటు పెరిగిపోతుందని, దానికి ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సి ఉంటుండగా ఏమాత్రం పట్టించుకోకుండా జవాబుదారీతనానికి దూరంగా రాజకీయ పాలన కొనసాగిస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులైన రాజకీయ నాయకులకు, ప్రభుత్వాలకు సంబంధించిన ఆధారాలను ఎట్టి పరిస్థితిలో రహస్యంగా ఉంచకూడదన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నది మాత్రం ముమ్మాటికీ ప్రజాప్రతినిధులేనని ఒక్క అంశంలో చెప్పారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం పని చేయాలనే తపన నేటి రాజకీయ నాయకులలో చాలా తక్కువగా ఉందని, దానివల్ల స్వార్థపూరిత రాజకీయాలకు పెద్దపీట వేస్తున్నారని పెద్ద ఎత్తున విమర్శించారు. ప్రపంచ దేశాలలో ప్రభుత్వాల పరిపాలనలు ఎలా కొనసాగుతున్నాయో, భారతదేశంలో పరిపాలనలు ఎలా కొనసాగుతున్నాయో ప్రజాస్వామ్య రక్షకులు గుర్తిస్తునంత సులభంగా రాజకీయ నాయకులు గుర్తించలేకపోతున్నారన్నారు. రాజకీయాలలో ఎన్నికలప్పుడే ప్రజాసేవ గుర్తుకు వస్తుందని, తర్వాత సేవ అనే పదాన%అనెఱ% ఆమడ దూరంగా పరిపాలన నడుస్తున్నాయన్నారు. రాజ్యాంగ నియమాలను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వాలకు న్యాయస్థానాలు ఏ మాత్రం మద్దతు ఇవ్వకూడదన్నారు. కాలం గడుస్తున్న కొద్దీ ఎక్కడి గొంగడి అక్కడే ఉన్నట్టుగా దేశ అభివృద్ధి వెనుకబాటుతనంలో ముందుకు పోతుందని, దాని నుండి భారతదేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులదేనన్నారు. ముఖ్యంగా నేటి భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన బాధ్యత మీడియా తీసుకోవాలని సూచిస్తూ, నేటి మీడియా దేశ రక్షణలో భాగంగా ఏ విధంగా పని చేస్తుందో అన్ని రాష్ట్రాల ప్రజలతో పాటు ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయన్నారు. ప్రభుత్వాల ఆధీనంలో పని చేయాల్సిన దుర్మార్గపు స్థితికి మీడియా సంస్థలు దిగజారిపోతున్నాయని తీవ్రంగా విమర్శించారు. కొంతమంది సీనియర్ జర్నలిస్టులను, కొన్ని యూట్యూబ్ ఛానల్స్‌ను గమనిస్తున్నప్పుడు ప్రజాస్వామ్య రక్షణ కోసం వాళ్లు పడుతున్న పాట్లు అద్భుతమైనవన్నారు. నామమాత్రానికి జర్నలిజం చేయడం దేనికోసమో ప్రజలకు, ప్రజాస్వామ్యవాదులకు సమాధానం చెప్పండి అంటూ పత్రిక, టీవీ ఛానల్ యజమానులను ప్రశ్నించారు. పనికిరాని అంశాలను పెద్ద ఎత్తున చూపిస్తూ సమాజాన్ని తప్పుడు మార్గంలో నడిపించడంలో మీడియా పాత్ర కూడా ఉందని ప్రజలు, మేధావులు, నిరుద్యోగులు, ప్రజాస్వామ్యవాదులు మండిపడి విమర్శిస్తున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం దేశంలో సోషల్ మీడియా ఒక్కటే రాజకీయాలపై నిజాయితీగా పని చేస్తున్నాయని గుర్తు చేశారు. నేటి దినాల్లో నిజాయితీ గల జర్నలిజం చేయడం చాలా అరుదన్నారు. ఎవరైనా ప్రజల హక్కులను రక్షించడం కోసం మాత్రమే పని చేయాల్సి ఉంటుందని, దానికి పూర్తి భిన్నంగా బాధ్యతను మరచి ప్రజలకు వ్యతిరేకమైన పనులు చేస్తూ ప్రజలు కడుతున్న పన్నులతో జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ అధికారులు, ప్రజలచే పన్నులు కట్టిస్తున్న ప్రభుత్వాలు ప్రజాస్వామ్య రక్షణకు లోబడి పని చేయాలని గుర్తు చేశారు. న్యాయస్థానాలు కనబరుస్తున్న అత్యంత ప్రతిభావంతమైన నిజాయితీలో భాగమైన కేసుల వాదనల లైవ్ టెలికాస్ట్‌లను చూస్తున్న సందర్భాలను గుర్తుచేసుకుంటూ ప్రపంచ దేశాలు గర్విస్తున్నాయన్నారు. అదే ప్రాతిపదికన ప్రభుత్వ కార్యాలయాలు, అధికార హోదాకు సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రజాక్షేత్రంలో, ప్రజాస్వామ్యవాదుల క్షేత్రంలో పొందుపరుస్తూ ప్రజాస్వామ్యాన్ని ఎప్పటికప్పుడు రక్షించుకునే బాధ్యతను నెరవేర్చాలని సూచించారు. ప్రతి ఆధారాన్ని రహస్యంగా దాస్తూ రాజకీయాలాడుతుండడం ప్రజాస్వామ్యాన్ని వెనక్కు నెట్టడమేనన్నారు. దేశాన్ని పాలిస్తున్న నాయకులు, అన్ని రాష్ట్రాలను పాలిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్య రక్షణ కోసం ఎంత కష్టపడి పని చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందరూ సమాజ హితం కోసం పని చేస్తున్నామని అంటున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎందుకు పతనావస్థ స్థితిలోనికి వెళుతుందో తెలియజేయాల్సిన బాధ్యత మాత్రం ప్రభుత్వాలదేనన్నారు.



# మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్

హైదరాబాద్: మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. వరుస ఎన్‌కౌంటర్ల తరవాత తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలు ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 303 రైఫిల్స్, జీ-3 రైఫిల్స్, ఎకె47లు, భారీగా బు÷-లలెట్స్ స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. మిగతా 34 మంది మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు చెప్పారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వీరంతా జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చినట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలను కూడా అప్పగించినట్లు తెలిపారు. 37 మందికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందజేశారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉంది. వీరితోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపైనా కలిపి మొత్తం రూ.1.41కోట్ల రివార్డు ఉంది. ఆ మొత్తాన్ని వారికే అందజేస్తాం అని తెలిపారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తాం. మిగతావాళ్లు కూడా తొందరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అన్నారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణేళిశ్,బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారు. వీళ్లంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. మావోల లొంగుబాటు సందర్భంగా ఆయన పలు అంశాలు వివరించారు. ఏ రకంగా బయటికి వచ్చినా.. మావోయిస్టులను అన్ని విధాలుగా ప్రభుత్వం చూసుకుంటుందని డీజీపీ అన్నారు. మీడియా ద్వారా వచ్చినా, ప్రభుత్వ ఉద్యోగులు ద్వారా వచ్చినా, రాజకీయ నాయకుల ద్వారా వచ్చినా తాము స్వాగతిస్తామని డీజీపీ పేర్కొన్నారు. మావోయిస్టులు పార్టీ పరంగా విబేధాలు, ఆరోగ్య కారణాలు, ఇలా అనేక కారణాలతో బయటికి వస్తున్నారని డీజీపీ తెలిపారు. 'తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఉన్న ఆజాద్ 30 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నాడు. ములుగు జిల్లాకు చెందిన ఆజాద్ మీద రూ.20లక్షల రివార్డ్ ఉంది. అప్పాసి నారాయణ మీద రూ.20లక్షలు రివార్డ్ ఉంది. మిగతా వారికి రూ.25 వేలు చొప్పున ఇస్తున్నామని డీజీపీ తెలిపారు. 11 నెలల్లో 465మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో 59మంది తెలంగాణకు చెందిన వారని డీజీపీ వెల్లడించారు.

# పార్టీకి తెలయచేసి లొంగిపోయాం

**ఇప్పుడున్న స్థితిలో ఇక ఉద్యమించలేం**

**ఆరోగ్యం కూడా సహకరించడం లేదన్న ఆజాద్**

**హైదరాబాద్,నవంబరు 22(జై భీమ్ న్యూస్):**

మేం పార్టీకి చెప్పే లొంగిపోయామని మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబయ్య అలియాస్ ఆజాద్ తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టు పార్టీ పిలుపునిస్తుందని పేర్కొన్నారు. స్టేట్ కమిటీలో ఉన్న ఇంకా ఇద్దరు అగ్రనేతలు కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. తామంతా జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని నిర్ణయం తీసుకున్నామని దండకారణ్యం స్పెషల్ జోన్ సభ్యుడు ఎర్రా తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లో ఉద్యమాన్ని నడిపించడం కష్టమని పేర్కొన్నారు. మా ఆరోగ్య పరిస్థితులు కూడా సహకరించడం లేదని చెప్పారు. మిగతా మావోయిస్టులు కూడా లొంగిపోవడం మంచిదని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యాల సాంబయ్య అలియాస్ ఆజాద్, అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్రా ఉన్నట్లు డీజీపీ తెలిపారు. మిగతా 34 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో 25 మంది మహిళలే ఉన్నట్లు తెలుస్తోంది. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, 9 మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు డీజీపీ చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు నగదుతోపాటు మరికొన్ని వెసులుబాట్లు కూడా కల్పిస్తామని చెప్పారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాసి నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉందని డీజీపీ తెలిపారు. వీరితో పాటు లొంగిపోయిన మావోయిస్టులు అందరిపైనా కలిపి మొత్తం 1.41 కోట్ల రివార్డు ఉందని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని వారికే అప్పగిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తామని తెలిపారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు ఉన్నారని.. వారు కూడా తొందరగా లొంగిపోవాలని పిలుపునిచ్చారు.

# హిడ్మా తదితరలు ఎన్‌కౌంటర్

**నేడు భారత్ బంద్‌కు మావోయిస్టుల పిలుపు**

**అప్రమత్తం అయిన పోలీసులు**

**విజయవాడ,నవంబరు 22(జై భీమ్ న్యూస్):**

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా ఎన్‌కౌంటర్‌కి నిరసనగా ఆదివారం దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తూ పార్టీ ప్రతినిధి అభయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన రాసిన లేఖలో.. నిరాయుధులైన హిడ్మా, అతడి భార్య రాజే సహా ఆరుగురు మావోయిస్టులను ఏపీ పోలీసులు విజయవాడలో అదుపులోకి తీసుకుని ఆ తరువాత మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో కాల్చి చంపి, దానిని ఎన్‌కౌంటర్‌గా చెప్పుకున్నారని ఆరోపించారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా చికిత్స కోసం విజయవాడకు వచ్చారని, విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఎస్ఐబీ పోలీసులు అతన్ని పట్టుకుని.. 15న అరెస్ట్ చేసి, 18వ తేదీన హిడ్మాను బుటకపు ఎన్ కౌంటర్ చేశారని మావోయిస్ట్ పార్టీ ప్రతినిధి అభయ్ ఆరోపించారు. అలాగే, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆదివాసీ సంఘం సీనియర్ నాయకుడు మనీష్ కుంజా కూడా ఈ ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండించారు. తాడిమెట్ల, జీరంఘాట్ ఘటనల్లో మాద్వి హిడ్మా ప్రమేయం లేదని పేర్కొన్నారు. ఆంధ్రాకు చెందిన కొంత మంది పార్టీకి చెందిన నాయకులే హిడ్మా కదలికలపై పోలీసులకు సమాచారం ఇచ్చారు.. ఈ ఎన్‌కౌంటర్‌లో దేవ్‌జీ పాత్ర ఉందని తెలుస్తుందని చెప్పుకొచ్చారు. కాగా, ఈ ఎన్ కౌంటర్ ని వ్యతిరేకిస్తూ మావోయిస్టులు పెద్ద ఎత్తున నిరసనకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే భారత్ బంద్‌కి పిలుపునివ్వడంతో.. భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో పలుచోట్ల పోలీసు బందోబస్తు కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా రంపచోడవరం ఏజెన్సీ ఏరియాలో పోలీసులు అలర్ట్ అయ్యారు. ప్రజా ప్రతినిధులు ఏజెన్సీ ప్రాంతాలను విడిచి మైదాన ప్రాంతాలకు వెళ్లాలని పోలీసులు సూచనలు చేశారు.

# సుప్రీం తీర్పు... గవర్నర్ల వ్యవహారం !

పదవీ విరమణ చేయబోతున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బుధ, గురు వారాల్లో రెండు రాజ్యాంగ ధర్మాసనాలకు నేతృత్వం వహించి తీర్పులిచ్చారు. రాష్ట్రపతి న్యాయ సలహా కోరిన అంశంపై గురువారం ఏకాభిప్రాయంతో తీర్పు సంచలనంగానే పేర్కొనాలి. ఎందుకంటే తమిళనాడు కు సంబంధించిన పలు బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా తొక్కిపెడుతుండటంతో అక్కడి ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు గవర్నర్‌ను ఆదేశించింది. బిల్లులను తొక్కిపట్టే విధానాన్ని తప్పుబట్టింది. అయితే, గవర్నర్ మాత్రం బిల్లులను ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ ఈ ఏడాది ఏప్రిల్ 8న సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా పది బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టారని ప్రకటించింది. రాజ్యాంగ విధుల్లో విఫలయ్యారని, రాజ్యాంగబద్ధ పాలన కూలిపోయే పరిస్థితి కల్పించారని మండిపడింది. బిల్లులు తిప్పిపంపకుండా దగ్గర పెట్టుకోవడం కుదరదని చెప్పింది. తిప్పి పంపిన తర్వాత మళ్లీ శాసనసభ ఆమోదిస్తే గవర్నర్ ఆమోదించాల్సిందేనని స్పష్టం చేసింది. గవర్నర్‌కు పంపిన బిల్లులు ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మే 13న రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టును 14 ప్రశ్నలతో న్యాయ సలహా కోరింది. వాటికి సుప్రీంకోర్టు గురువారం సమాధానం ఇచ్చింది. వాదనల సమయంలో ఏప్రిల్ 8 నాటి సుప్రీంకోర్టు తీర్పును తోసిపుచ్చే ఉద్దేశం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పదేపదే చెప్పారు. గురువారం నాటి తీర్పు కాపీలోనూ... మరో తీర్పును తోసిపుచ్చేందుకు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సలహా కోరడాన్ని ఉపకరణంగా వాడటం కుదరదని పేర్కొంది. ప్రత్యేకించి కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు ఆయా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కొంత పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా బిల్లుల ఆమోదం విషయంలో వారు సకాలంలో నిర్ణయం తీసుకోవడం లేదు. లేదా తిప్పి పంపడం లేదు. ప్రధానంగా బెంగాల్, తమిళనాడు, తెలంగాణల్లో ఇలాంటి పరిస్థితులను చూశాం. అయితే రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లుల ఆమోదంలో గడువు విధించడం తగదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఇటీవలే తేల్చిచెప్పింది. ఈ తీర్పుతో ఇప్పుడు గవర్నర్ల వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నా ప్రశ్నించే అవకాశం లేకుండా పోయింది. అలాగే బిల్లులను సకాలంలో పంపాలన్న నిబంధన లేకపోతే వారు రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చెలాయిస్తారని తమిళనాడు, బెంగాల్ తదితర రాష్ట్రలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ దీనిపై చర్చించాల్సి ఉంది. గవర్నర్లకు ఉండే వెసలుబాటులోనూ సమయాభావన ఉండాలన్న దానిపై చర్చించాలి. అవసరమైతే చట్టపరంగా మార్పులకు శ్రీకారం చుట్టాలి.అప్పుడే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు ఆమోదం దక్కుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లుల ఆమోదంలో గవర్నర్ సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చని కూడా స్పష్టం చేసింది. అయితే, గవర్నర్ ఎటువంటి కారణం చెప్పకుండా నిరవధికంగా ఆలస్యం చేయడం తగదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం అభిప్రాయ పడింది. అటువంటి సమయంలో సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవా లని గవర్నర్‌ను న్యాయస్థానం ఆదేశించవచ్చని చెప్పింది. రాష్ట్రాల శాసన సభలు ఆమోదించి పంపించిన బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలిపే అంశానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక నిర్ణయాన్ని వెలువరించింది. రాష్ట్రపతి, గవర్నర్లు తీసుకునే చర్యలు న్యాయస్థానాల పరిశీలనకు అతీతం కాదని చెబుతూనే రాజ్యాంగ అధినేతలకు బిల్లుల ఆమోదం కోసం గడువు విధించడం సరైంది కాదని స్పష్టం చేసింది. రాష్ట్రపతి రాజ్యాంగాధినేత కావడం వల్ల కొంత ఆలోచన చేయవచ్చు. కానీ గవర్నర్లు ఈ విషయంలో కొంత రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎందుకంటే బిల్లులను తొక్కిపెట్టి కాలయాపన చేయడం వల్ల తీసుకోవాల్సిన నిర్ణయాలు ఆలస్యం అవుతున్నాయి. సుప్రీం తీర్పు తరవాత తమిళనాడు సిఎం స్టాలిన్ కూడా స్పందించారు. గవర్నర్లకు సమయం ఉండాలని, నిర్దేవజత గడువు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం అవసరమైతే రాజ్యాంగ సవరణ జరగాలన్నారు. ఇకపోతే గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయని సుప్రీంకోర్టు తెలిపింది. ఒక బిల్లు గవర్నర్ దగ్గరికి వచ్చినప్పుడు అన్నీ పరిశీలించి సమ్మతి తెలియ జేయడం లేదా ఏదైనా సహేతుకమైన కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం చేయాలి. లేదా బిల్లును తిరస్కరించి తిరిగి అసెంబ్లీకి పంపడం చేయాలి. కానీ చాలా సందర్భాల్లో అలా జరగడం లేదు. తమిళనాడు గవర్నర్ రవి ఇలాంటి నిబంధనలు పక్కన పెట్టారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న సమయంలో తమిళసై సైతం ఇదే ధోరణితో ఉన్నారు. ప్రభుత్వాలు ఏదైనా నిర్ణయం తీసుకుంటే సకాలంలో ఔనని లేదా కాదని చెబితే బాగుండేది. కానీ దానిపై సమాధానం ఇవ్వక పోవడం అన్నది, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేదే తప్ప మరోటి కాదు. అయితే ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో రాజ్యాంగంలోని 200 నిబంధన కింద గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారని, అటువంటి సమయంలో న్యాయస్థానాలు గడువు విధించడం సరికాదని సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయ పడింది. బిల్లులకు ఆమోదం తెలిపేటప్పుడు కానీ, ఆమోదాన్ని నిలిపివేసే సమయంలో కానీ గవర్నర్ తన సొంత విచక్షణ ప్రకారం వ్యవహరించవచ్చని కూడా సూచించింది. అలాంటి సమయాల్లో మంత్రి మండలి సలహా ప్రకారం నడుచుకోవాల్సిన అవసరం లేదు. అయితే, సుదీర్ఘకాలం వివరించలేని కారణాల వల్ల ఒక బిల్లుపై నిర్ణయం తీసుకోకపోతే సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవలసిందిగా కోర్టు గవర్నర్‌కు పరిమితమైన ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపింది. 361 అధికరణ కింద వారికి రక్షణ కవచం ఉన్నప్పటికీ సుదీర్ఘమైన ఆలస్యం జరిగినప్పుడు హేతుబద్ధమైన సమయంలో బిల్లులను ఆమోదించేందుకు, తిరిగి పంపేందుకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపింది. ఇకపోతే తన పరిశీలనకు వచ్చిన ప్రతి బిల్లుపై రాష్ట్రపతి రాజ్యాగంలోని 143వ అధికరణం కింద సుప్రీంకోర్టు సలహా కోరనవసరం లేదు. గవర్నర్లు నిరవధికంగా ఒక బిల్లును తమ వద్ద ఉంచుకోరాదు అనేదే ప్రధానం. అందువల్ల పరిమితమైన న్యాయ సమీక్ష ఉండవచ్చని రాజ్యాంగ ధర్మాసనం తన ఏకగ్రీవ తీర్పులో అభిప్రాయపడింది. రాజ్యాంగంలో బిల్లును సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని ఉన్నప్పటికీ దాన్ని గవర్నర్లకు, రాష్ట్రపతికి డెడ్‌లైన్ పెట్టేందుకు రాజ్యాంగం ఇచ్చిన అనుమతిగా భావించనక్కరలేదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. డెడ్‌లైన్ పెట్టి, ఆలోగా ఆమోదం ఇవ్వకపోతే లభించినట్లుగానే భావించడం రాజ్యాంగంలోని అధికారాల విభజన సూత్రానికి భంగం కలిగిస్తుందని తెలిపింది. మొత్తంగా గవర్నర్లకు ఇప్పుడు విచక్షణ ఉందని తేల్చింది. అంటే బిల్లులను ఎంతకాలమైనా పెండింగ్‌లో పెట్టుకునే అవకాశం ఉంది. అయితే అది ఎంతకాలం అన్న చర్చ జరగాలి. లేదా దానికి కూడా పరిమిత కాలం అంటూ ఉండాలి. అప్పుడే గవర్నర్ల పెత్తనం అతిగా ఉండదు. తమిళనాడు వ్యవహారం, సుప్రీం తీర్పు నేపథ్యంలో గవర్నర్లకు సంబంధించి తప్పకుండా చర్చచేయాల్సి ఉంది. ఇందుకు పార్లమెంట్ పూనుకోవాలి. ఇలాంటి విషయాల్లో విపక్షపార్టీ సభ్యులు చర్చకు పట్టుబట్టాలి. అప్పుడు సమస్యకు మార్గం దక్కగలదు.

# పెన్నే కదాని తృణీకరిస్తే గన్నై కూల్చింది






### కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం
### ఉద్యమకారులను నాటి పాలకులు విస్మరించారు
### చదువుకోని అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు
### ఆయన లేకుండా తెలంగాణ ఉద్యమసభలు లేవు
### అందెశ్రీ సంస్మరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారే ముందుండి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లారని అన్నారు. వారు లేకుంటే తెలంగాణ లేదని అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన అందెశ్రీ సంతాప సభలో సీఎం ప్రసంగించారు. ఉద్యమానికి కవులు, కళాకారులు ఇచ్చిన ఊపుతోనే తెలంగాణ సాకారమైందని, ఇది ఎవరూ కాదనలేని నిజమన్నారు. అంతేగాకాకుండా వారే తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకుని మోసారని అన్నారు.. ఎన్నడూ బడికి వెళ్లని అందెశ్రీ అద్భుతమైన జయజయహే తెలంగాణ పాట రాశారు. బడికి వెళ్ళని అందె శ్రీ రాసిన జయ జయ హే తెలంగాణ గీతం రాసిన చరిత్ర తెలంగాణకు ఉంది అని రేవంత్ తెలిపారు. బాధతో.. ఉద్వేగంతో చెప్తున్నా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటకు గౌరవం దక్కాలని కోరుకున్నారు. ఉద్యమంలో ప్రతి నాలుక మీద, ప్రతి వేదిక మీద జయ జయ జయహే తెలంగాణ పాట నిలిచింది.. తెలంగాణ గీతం స్ఫూర్తి నింపిన కవులు, రచయితలను కించపరిచే విధంగా గత పాలకుల చర్యలు ఉన్నాయని సీఎం రేవంత్ అన్నారు.అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమంలో ఒక్క సభ కూడా జరగలేదని గుర్తు చేశారు. ఊరూరా పాటలతో అందెశ్రీ ఉద్యమానికి ఊపిరిలూదారని అన్నారు. కానీ, తెలంగాణ సాకారమైన తర్వాత ఆ పాట మూగబోయింది. ఆయనను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పాలకుల దృష్టిలో పదేళ్లు మూగబోయి ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్యం గానమై నిలిచిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని కనుమరుగు చేసే ప్రయత్నం ఆనాడు జరిగిందన్నారు. కవి రాసే పెన్నుల మీద మన్ను కప్పితే.. అవి గన్నులై మొలకెత్తుతాయ్.. మీ గడీలను కుప్పకూలుస్తాయ్ అన్న నినాదాన్ని అందెశ్రీ నిజం చేశారని సిఎం రేవంత్ అన్నారు. ప్రజలు కోరుకున్న జయ జయహే తెలంగాణను.. రాష్ట్ర గీతంగా ప్రకటించడమే కాకుండా.. ప్రతి బడిలో పాడాలి, పాఠ్య పుస్తకాల్లో రాయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో.. అంత చైతన్యవంతులని తెలంగాణ ఉద్యమమే రుజువు చేసిందన్నారు. ఈ గడ్డ మీద ప్రజలు అహంకారాన్ని, అధిపత్యాన్ని సహించలేరని, అందుకు నడుస్తున్న చరిత్రే సాక్షాత్కారమని అన్నారు. ఎన్ని వజ్రాలు ఉన్నా.. కోహినూరు వజ్రం ప్రత్యేకం. అలాగే ఎందరు కవులు ఉన్నా.. డా.అందెశ్రీ ప్రత్యేకంఅని సీఎం అన్నారు. తెలంగాణ ప్రాంతం ఎంత ప్రేమ చూపిస్తుందో.. అంతే పోరాటాన్ని కూడా చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు, కవులు, కళాకారులూ ఎన్నో పోరాటాలు చేశారు.. గతంలో నిజాం సర్కార్ వాళ్ళను సైతం ఎదురొడ్డి పోరాడిన చరిత్ర తెలంగాణకు ఉందని సీఎం చెప్పారు. గద్దర్, గోరేటి వెంకన్న వంటి ఉద్యమకారులు తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని రూపకల్పన చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం జయ జయ హే తెలంగాణ పాటను ప్రభుత్వం గుర్తించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన రావాలని అందె శ్రీ, గద్దర్ అన్న లాంటి వాళ్ళ స్ఫూర్తి తోనే ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 9 మంది ఉద్యమ కారులను గుర్తించడం జరిగింది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఫ్యూచర్ సిటీలో వారి కుటుంబానికి ఇళ్లను నిర్మించి అండగా నిలుస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర తెలంగాణ ఉద్యమ కారులది. దేశంలో ఎస్సి వర్గీకరణ అమలు చేసిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానిది. వర్గీకరణ అనేది ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేలా ఉండాలి.. అలాగే సమాజాన్ని ముందుకు నడిపించాలానే ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రమంత్రి వర్గంలో దళితులకు పెద్ద పీట వేయడం అనేది సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకే నిర్ణయాలు తీసుకున్నాం.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో ఎన్ని వజ్రాలు ఉన్నా కోహినూర్ వజ్రనిదే అసలైన గొప్పతనం.. అలాగే కళాకారులు ఎంతమంది ఉన్నా అందె శ్రీ అన్న.. కోహినూర్ వజ్రంలా నిలుస్తాడు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఆచార్య కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పలువురు కవులు, గాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటం వద్ద అందరూ నివాళి అర్పించారు. జయజయహేతో సభ మార్మోగింది. అందెశ్రీ అమర్ రహే అన్న నినాదాలు మిన్నంటాయి.



# పుట్టపర్తి చేరుకున్న ఉపరాష్ట్రపతి

### ఘనంగా స్వాగతం పలికిన సిఎం, మంత్రులు

**పుట్టపర్తి,నవంబరు 22(జై భీమ్ న్యూస్):**

సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. పుట్టపర్తిలో సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. రాష్ట్రపతి, ప్రధాని నరేంద్ర మోదీ సహా అనేక రంగాల ప్రముఖులు హాజరవుతున్నారు. శనివారం ఉదయం వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. తాజాగా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు పుట్టపర్తికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ చేరుకున్నారు. సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, సవిత, అధికారులు పుట్టపర్తి విమానాశ్రయం వద్ద ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి పూర్ణచంద్ర ఆడిటోరియం వద్దకు చేరుకున్నారు. శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. వారితోపాటు ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్, శ్రీ సత్యసాయి సెంట్రల్ టెస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలను తిలకించారు. సత్యసాయి బాబా మహా సమాధిని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ దర్శించుకున్నారు.



# సత్యసాయి ఆశిస్సులతో అగ్రస్థానానికి భారత్

### సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి
### సాయ సమాధి వద్ద నివాళి అర్పించిన రాధాకృష్ణన్

**పుట్టపర్తి,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

సత్యసాయి ఆశీస్సులతో 2047 నాటికి భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ఆశిస్తున్నట్టు ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ తెలిపారు. సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉప రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నవంబర్ 22 విశిష్టత గురించి సీఎం చెప్పగానే వస్తానని చెప్పా. ఇప్పటికే దేశంలో ముగ్గురు ప్రముఖులు పుట్టపర్తిని సందర్శించారు. సమాజ సేవ కోసం సత్యసాయిబాబా నాయకులను తయారు చేశారు. విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని లోకేశ్ ఆహ్వానించగానే అందరూ స్వాగతించారు. విద్యార్థులు దేశ నాయకులుగా ఎదుగుతారనేందుకు ఇదే నిదర్శనం. జీవితంలో ప్రతి రోజూ చాలా కీలకం. మానవ జీవితాలు యాంత్రికంగా, ఆధ్యాత్మికంగా సాగుతున్నాయి. విద్యాసంస్థ ద్వారా క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం నేర్పుతున్నారు. విద్యార్థులకు నైతిక విలువలు నేర్పే కేంద్రంగా సత్యసాయి విద్యాసంస్థ విలసిల్లుతోందని ఉప రాష్ట్రపతి అన్నారు. అంతకుముందు శ్రీ సత్యసాయి శతజయంతి వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. సత్యసాయి మహా సమాధి వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ తదితరులు ఉన్నారు. అనంతరం.. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు.వ్యక్తిత్వ కేంద్రంగా సత్యసాయి వర్సిటీ నిలుస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'సత్యసాయి వర్సిటీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. ప్రత్యేక ఆశయంతో సత్యసాయిబాబా భూమిపైకి వచ్చారు. సత్యసాయి.. భగవాన్ సాయి సిద్ధాంతం వ్యాప్తి చేశారు. క్రమశిక్షణ, ప్రేమ, సేవాభావం కలిగి ఉండాలని చెప్పారు. భారత్.. వేల ఏళ్లుగా ఆధ్యాత్మిక భావనలతో వర్ధిల్లుతోంది. వసుదైక కుటుంబం.. ప్రపంచమంతా ఒకే కుటుంబం అనేది మన సంస్కృతిలో ఉంది. సత్యసాయి విద్యాసంస్థ నైతికత, విలువలతో కూడి ఉంటుంది. విద్యార్థులకు ఆధ్యాత్మికత, సేవాభావాన్ని విద్యాసంస్థ నేర్పిస్తుంది. అందరినీ ప్రేమించాలి.. సేవ చేయాలి అనేది భగవాన్ సాయి సిద్ధాంతం. సహాయ గుణం కలిగి ఉండాలే కానీ, ఎవరినీ నొప్పించవద్దనేది సిద్ధాంతం. సత్యం, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు సూత్రాలు చెప్పారని సీఎం అన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని తుల్జారాణి ఎంపిక



**వరంగల్ జిల్లా, వంచనగిరి, నవంబర్ 22 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా నుంచి మరో ప్రతిభావంతురాలు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. వంచనగిరిలోని ఆదర్శ పాఠశాల-కళాశాలలో ఇంటర్ MPC ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి. తుల్జారాణి జిల్లా స్థాయి జూనియర్ బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన చేసి రాష్ట్రస్థాయికి చేరుకుంది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో రక్షణ, రైడ్, పట్టుదల, చురుకుదనంలో ఆమె అసాధారణ నైపుణ్యం ప్రదర్శించింది. ఆమె ప్రదర్శన సెలక్షన్ కమిటీ దృష్టిని ఆకర్షించింది. ఎంపిక సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయుడు శరత్ ఆమెను అభినందించారు. తుల్జారాణి మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆమె విజయంతో ఆదర్శ విద్యాసంస్థలో ఆనందం నిండింది. సహపాఠులు గర్వంగా భావిస్తున్నారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఆమె తీవ్ర శిక్షణ తీసుకుంటోంది.

## శభాష్ తమ్ముడూ.. నవీన్ యాదవ్ నూతన ఎమ్మెల్యేకి మంత్రి కొండా సురేఖ అభినందనలు



**హైదరాబాద్, నవంబర్ 22 (జై భీమ్ న్యూస్)**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ శుక్రవారం హైదరాబాద్‌లో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, ప్రచారంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా షేక్‌పేట్, వెంకటగిరి ప్రాంతాల్లో మంత్రి సురేఖ కీలక పాత్ర పోషించినట్టు నవీన్ యాదవ్ ప్రత్యేకంగా గుర్తు చేశారు. మంత్రి కొండా సురేఖ నూతన ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి, "శభాష్ తమ్ముడూ%ొ% నీ విజయం నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది" అంటూ అభినందించారు. బీసీ యువకుడు ఇంత పెద్ద మెజారిటీతో గెలవడం తనను సంతోషపరిచిందని, తానూ చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికైన సంగతి గుర్తు చేశారు. "నీకు ఉజ్వల భవిష్యత్తు ఉంది. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తే రాజకీయ జీవితం మరింత శోభిల్లుతుంది" అని సూచించారు. మంత్రివర్యుల మాటలు తనలో మరింత ఉత్సాహం నింపాయని నవీన్ యాదవ్ తెలిపారు. జూబ్లీహిల్స్ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుని పని చేస్తానని హామీ ఇచ్చారు.

## పోలీసు మెగా వైద్య శిబిరం విజయవంతం

### 1400 మందికి వైద్య సేవలు

**వరంగల్, నవంబర్ 22 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. పోలీసు అధికారులు, వారి కుటుంబ సభ్యులకు మొత్తం 1400 మందికి వైద్య పరీక్షలు, చికిత్సలు అందించినట్లు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. నవీన్ అడ్వాన్స్ న్యూరోకేర్, భగీరథ కార్డియాక్ కేర్-మేఘన మల్టీ స్పెషాలిటీ, మెడికవర్ హాస్పిటల్స్ సహకారంతో జరిగిన శిబిరంలో:



400 మంది పురుషులకు 2D ఎకో

400 మందికి ECG

200 మంది మహిళలకు 2D ఎకో & ECG

1400 మందికి మధుమేహ పరీక్షలు

400 మందికి డయాబెటిక్ న్యూరోపతి స్క్రీనింగ్

250 మందికి కార్డియో సంబంధిత పరీక్షలు

సుమారు 5 లక్షల విలువైన మందులను సెంట్రల్ మెడిసిన్ స్టోర్ అందించింది. డీఎంహెచ్ఓ డా. అల్లం అప్పయ్య శిబిరాన్ని సందర్శించి సిబ్బందిని అభినందించారు.

ట్రాఫిక్ పోలీసులకు 50 వేల మాస్కులు. పొల్యూషన్ నుంచి రక్షణ కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసులకు 50 వేల మాస్కులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు డీఎంహెచ్ఓ, ఫార్మసీ ఆఫీసర్ ఉప్పు భాస్కరరావు తెలిపారు. కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వైద్య బృందాన్ని, ఫార్మసీ అధికారులను అభినందించారు.

# హలో మాల..చలో ఢిల్లీ

### రాజ్యాంగ హక్కుల సాధన కోసం దళితుల ఐక్యత సభ విజయవంతం చేద్దాం

**ములుగు, నవంబర్ 22 (జై భీమ్ న్యూస్)**



జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో నవంబర్ 26న ఢిల్లీలో "హలో మాల-చలో ఢిల్లీ" కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏటూరునాగారం మండలంలో బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. జాతీయ అధ్యక్షులు అద్దంకి దయాకర్, రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరుగుతుందని లక్ష్మణ్ బాబు తెలిపారు. మాల సమాజంపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు, రాజ్యాంగ విరుద్ధమైన జీవో నం. 99 రోస్టర్ విధానాన్ని పునఃసమీక్షించాలని, ఎస్సీ రిజర్వేషన్‌ను 15% నుంచి 20%కి పెంచాలని డిమాండ్ చేశారు.

**ఇతర ప్రధాన డిమాండ్లు:**

నూతన పార్లమెంట్ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలి

భారత కరెన్సీ నోట్లపై అంబేద్కర్ చిత్రం ముద్రించాలి

ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని 41 సీఆర్‌పీసీ సెక్షన్‌ను రద్దు చేయాలి.

12 అంశాల డిమాండ్లతో జరగనున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మాల సమాజం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిట్ట మల్ల సమ్మయ్య, మాదరి రామయ్య, మాదరి చంద్రమౌళి, పెంచికల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని ప్రారంభించిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్





**వరంగల్, నవంబర్ 22 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తెలంగాణ ఫోరెన్సిక్ విభాగం కేటాయించిన రెండవ మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శనివారం పచ్చజెండా ఊపి సేవలోకి ప్రవేశపెట్టారు. నేరస్థలంలోనే ఆధునిక పరీక్షలు - దర్యాప్తుకు వేగం ఈ వాహనం ద్వారా ఫోరెన్సిక్, ఫింగర్‌ప్రింట్ నిపుణులు నేరస్థలానికి చేరుకొని అక్కడికక్కడే రక్తమరకలు, వేలిముద్రలు, ఇతర సాక్ష్యాలను సేకరించి, వాహనంలోని అత్యాధునిక పరికరాలతో ప్రాథమిక పరీక్షలు నిర్వహించగలరని సీపీ తెలిపారు. దీంతో కేసుల దర్యాప్తు వేగవంతం అవుతుందని, సాక్ష్యాల విశ్వసనీయత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రత్యేక శిక్షణ పొందిన ఆరుగురు సిబ్బంది ఈ వాహనంలో విధులు నిర్వహిస్తారు. కార్యక్రమంలో డీసీపీలు అంకిత్ కుమార్, గుణశేఖర్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్ డీసీపీ దారా కవితకు పదోన్నతి

**హైదరాబాద్, నవంబర్ 22 (జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్ సిటీ పోలీసు సైబర్ క్రైమ్ విభాగం డీసీపీ దారా కవితను సెంట్రల్ జోన్ నూతన డీసీపీగా తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. సైబర్ నేరాల నియంత్రణలో తన సమర్థత, ఆధునిక దర్యాప్తు పద్ధతులకు పేరొందిన దారా కవితను నగరంలోని అత్యంత కీలకమైన సెంట్రల్ జోన్‌కు ఎంపిక చేయడం విశేషం. రద్దీ ప్రాంతాలు, పర్యాటకం, వాణిజ్యం, రాజకీయ కార్యక్రమాల భద్రతా పర్యవేక్షణలో సెంట్రల్ జోన్ డీసీపీ పాత్ర అత్యంత కీలకం. త్వరలోనే ఆమె కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు.



## కోటిమంది మహిళల శక్తీకరణే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ ఘనంగా ప్రారంభం





**వరంగల్, నవంబర్ 22 (జై భీమ్ న్యూస్)**

దేశ అభ్యున్నతికి మహిళలే మూలస్తంభాలని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హనుమకొండలోని డీసీసీబీ బ్యాంకు సమావేశ మందిరంలో శనివారం ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కూడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు కలిసి మహిళలకు చీరలు అందజేశారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ - మహిళలు చదువులో, ఉద్యోగ-ఉపాధిలో ఎదిగితే సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందని, చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు నాణ్యమైన చీరలు తయారు చేయించామని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరలు నాణ్యత లేక చీరలుగా కాకుండా పంటచేన్లకే పనికొ?? అని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి రోజుకు 18 గంటలు ప్రజల సేవలో గడుపుతున్నారని, మహిళల కోసం ఇందిరమ్మ ఇళ ఇళ్లు, వడ్డీలేని రుణాలు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల యాజమాన్యం, ఉచిత బస్సు ప్రయాణం, ?500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సమైక్య సంఘం అధ్యక్షురాలు రజిని, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హనుమకొండ జిల్లాలో 4 కేంద్రాలు - 750 మంది విద్యార్థులు హాజరు

**హనుమకొండ, నవంబర్ 22 (జై భీమ్ న్యూస్)**

నవంబర్ 23న జరగనున్న ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలకు హనుమకొండ జిల్లాలో 750 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకోసం నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని డీఈఓ (ఎఫ్ఏసీ) ఎ. వెంకటరెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాలు: ఎస్ఆర్ మోడల్ స్కూల్ ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్ ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్ ప్రాథమిక ఉన్నత పాఠశాల (బస్టాండ్ రోడ్) పరీక్ష సమయం: ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు.. విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్, బ్లూ/బ్లాక్ బాల్ పెన్ తీసుకురావాలి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముందస్తుగా కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లు పూర్తి చేయాలని డీఈఓ ఆదేశించారు.

# సేంద్రీయ ఆకుకూరల సాగును ప్రోత్సహించాలి

**కలెక్టర్ సత్య శారద**

**వరంగల్, నవంబర్ 22 (జై భీమ్ న్యూస్)**

ఖిలా వరంగల్ మండలం ఫోర్ట్ వరంగల్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "ఎరువక సాగుబడి" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పాల్గొని మాట్లాడుతూ – ఆకుకూరల డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో సేంద్రీయ సాగును ప్రోత్సహించాలని, అది వినియోగదారుల ఆరోగ్యానికి, భూమి సారవంతతకు ఉపయోగపడుతుందని, రైతులకు దీర్ఘకాలిక ఆదాయం కల్పిస్తుందని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ మాట్లాడుతూ రైతులు FPOలుగా సంఘటితమైతే మధ్యవర్తుల ప్రభావం తగ్గి, మెరుగైన ధరలు లభిస్తాయని తెలిపారు. పంట కోతకు వారం రోజుల ముందు రసాయనాలు, పురుగుమందులు ఉపయోగించరాదని మండల వ్యవసాయ అధికారి జి. విజ్ఞాన్ హెచ్చరించారు.

**ప్రభుత్వ పథకాలు:**

పందల్ నిర్మాణానికి సబ్సిడీ

ఆకుకూరల సాగుకు 8,000 ప్రోత్సాహకం

హైబ్రిడ్ కూరగాయలకు 9,500 ప్రోత్సాహకం

రైతులు మార్కెట్ రవాణా, మధ్యవర్తుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. నేరుగా విక్రయించేందుకు ప్రత్యేక షెడ్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్లు దామోదర్ యాదవ్, సువర్ణ సురేష్ వినతిపత్రం అందజేశారు.



# రాజధాని రైతులకు పూర్తి న్యాయం

**ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు**
**ఆరు నెలల్లో సమస్యల పరిష్కారం**
**ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులు పూర్తి**
**కోర్టు కేసులు, వైకాపా తీరువల్ల కొంత ఆలస్యం**
**త్రిసభ్య కమిటీలో సమస్యలపై విస్తృతంగా చర్చ**
**రైతులకు మంత్రులు నారాయణ, పెమ్మసానిల హామీ**

**అమరావతి,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములు ఇచ్చిన ఏ రైతుకూ ఇబ్బంది లేకుండా చేయడమే లక్ష్యమని పురపాకల శాఖ మంత్రి నారాయణ అన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని పేర్కొన్నారు.రాజధాని ప్రాంత రైతుల సమస్యలపై సమావేశంలో చర్చించామని మంత్రి నారాయణ తెలిపారు. ఖచ్చితంగా ఆరు నెలల్లో రైతుల సమస్యలకు పరిష్కారం వస్తుందన్నారు. కోర్ట్ కేసులు.. ఇతర కారణాల వల్ల ఆలస్యం అయిందని చెప్పారు. ఒకరిద్దరు వాళ్ల స్వార్థం కోసం చెప్పే అంశాలను నమ్మవద్దని మంత్రి అన్నారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారంపై సీఆర్డీఏ కీలక సమావేశం నిర్వహించింది. రాజధానిలోని సీఆర్డీఏ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ భేటీ అయ్యింది. ఈ కమిటీలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఉన్నారు. సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ముఖ్య అధికారుల తో కమిటీ సమావేశమైంది. దీనికి రైతు జేఏసీ ప్రతినిధులు హాజరయ్యారు. రైతులు లేవనెత్తిన అంశాలపై పరిష్కారం దిశగా కమిటీ సమాలోచనలు చేసింది. గతంలో జగన్ ప్రభుత్వ తీరు వల్ల రాజధానిలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సమస్యలన్నీ పరిష్కరించాలని తమ కమిటీకి సీఎం సూచించారని తెలిపారు. రాజధానిలో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. జరీబు భూముల సమస్యకు 30 రోజుల్లో పరిష్కారం చూపిస్తాం. సీఆర్డీఏ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి జరీబు భూములను గుర్తిస్తారు. గ్రామ కంతాల సమస్య కూడా పరిష్కరిస్తాం. లంక భూముల సమస్యను జగన్ జఠిలం చేశారు. దీనిపై వైకాపా నేతలు కోర్టులో కేసులు వేశారు. అసైన్డ్ భూములను కొందరు అమ్ముకుంటే జగన్ ప్రభుత్వం తప్పుబట్టి ఆపేసింది. మిగతా ప్రాంతాల్లో అసైన్డ్ చట్టానికి, రాజధానిలో అసైన్డ్ భూములకు వ్యత్యాసం ఉంది. ఈ సమస్య పరిష్కారానికి మూడు నెలల సమయం పడుతుంది. 90 శాతం రైతులకు ఎ÷–లాట్ల కేటాయింపు పూర్తయింది. రాబోయే 15 ఏళ్లలో జనాభా పెరుగుదల అంచనాల ప్రకారం మౌలిక వసతులు కల్పిస్తాం. 20 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. వచ్చే జూన్ నాటికి రాజధాని గ్రామాల్లో తాగునీరు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేస్తాం, మరో వారం తర్వాత త్రిసభ్య కమిటీ సమావేశం అవుతుందని పెమ్మసాని అన్నారు. రాజధాని రైతుల సమస్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించిన కమిటీ శనివారం భేటీ అయ్యిందన్నారు.అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాజధాని కోసం 30 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు ఇచ్చారన్నారు. ఇంత మంది రైతులు ఉన్నప్పుడు అనుకున్నంత వేగంగా అన్నీ జరగవని చెప్పుకొచ్చారు. 700 ఎకరాల భూమిలో రైతులకు సమస్యలు ఉన్నాయని.. వీటిలో వివిధ కారణాలతో సమస్యలు వచ్చాయని తెలిపారు. సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలని భేటీలో చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా జరిబు ల్యాండ్ సమస్యల విషయంలో నిజమైన జరిబు రైతులకు న్యాయం చేస్తామని వెల్లడించారు. దీనిలో కూడా 180 ఎకరాల్లో మాత్రమే సమస్య వచ్చిందని.. 30 రోజుల్లో నిజనిర్ధారణ చేసి పరిష్కారం చేస్తామని కేంద్రమంత్రి తెలిపారు. గ్రామకంతాల విషయంలో గైడ్ లైన్స్ పాటించకుండా చేసినందు వల్ల 36 ఎకరాల్లో సమస్యలు వచ్చాయని కేంద్రమంత్రి వివరించారు. గ్రామ కంతాలలో ఎవ్వరికైనా ఎక్కువ ఇచ్చినట్టు గుర్తిస్తే వాటిపై రీ సర్వే చేస్తామన్నారు. 30 రోజుల్లో అడిషనల్ కమిషనర్ రిపోర్ట్ తీసుకొని పరిష్కరిస్తామన్నారు. అసైన్డ్ ల్యాండ్స్ విషయంలో, జగన్ వచ్చాక లంక భూముల విషయంలో కోర్టు చిక్కులు ఏర్పడ్డాయని అన్నారు. అసైన్డ్ ల్యాండ్స్ విషయంలో అమ్ముకునే అవకాశం ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వం కుదరదని చెప్పడంతో ఇబ్బందులు వచ్చాయన్నారు. 90 శాతం మందికిపైగా రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చేసినట్లు తెలిపారు. గ్రామాల వారీగా అభివృద్ధికి 20 రోజుల్లో 25 గ్రామాలకు డీపీఆర్ సిద్ధం చేస్తామన్నారు. 2026 జూన్ నాటికి గ్రామాల్లో మౌలికవసతులను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. లే ఔట్‌లు ఇచ్చిన చోట సరిహద్దు రాళ్ళు పోయాయన్నారు. దీంతో డిసెంబర్ 5 నుంచి సరిహద్దు రాళ్ళ సమస్య పరిష్కరిస్తామన్నారు. అపోహలు నమ్మొద్దని రైతులకు చెబుతున్నామని.. రెండు వారాలకు ఒకసారి ఈ కమిటీ సమావేశమవుతుందని తెలిపారు. సమస్యలన్నింటినీ ఆరు నెలలలోగా పరిష్కరిస్తామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలో ఉన్న లే ఔట్లలో సరిహద్దు రాళ్లు వేయాలని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం రెండు వైపుల మాత్రమే సర్వే రాళ్లు వేయగలిగామన్నారు. డ్రైనేజ్ వ్యవస్థ సెట్ అయ్యాక మిగిలిన రెండు వైపులా సర్వే రాళ్లు వేస్తామని చెప్పారు. రాజధాని గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న పైప్ లైన్లు పనికి రావని.. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ రావాలని తెలిపారు. రాజధాని గ్రామాల్లో శ్మశానాలు లేవన్నారు. మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని అన్నారు. త్వరలో డీపీఆర్ రెడీ చేస్తామని.. డీపీఆర్ తయారు చేశాక గ్రామ సభలు పెట్టి నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు.

# 9మంది నాన్ కేడర్ ఎస్పీల బదిలీ

**హైదరాబాద్,నవంబరు 22(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో తొమ్మిది మంది నాన్ క్యాడర్ ఎస్పీలను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటెలిజెన్స్ ఎస్పీలుగా పీ కరుణాకర్, ఎస్వీఎన్ శివరామ్, ఆర్ జగదీశ్వర్‌రెడ్డిని బదిలీ చేసింది. సైబరాబాద్ ఎస్‌బీ డీజీపీగా వైవీఎస్ సుధీంద్ర, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీగా సాయిశ్రీ నియామకమయ్యారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీగా వి అరవింద్ బాబు, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా ధార కవిత, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా ఎం రవీందర్‌రెడ్డి, సీఐడీ ఎస్పీగా ఎన్ అశోక్ కుమార్ బదిలీ నియామకమయ్యారు. ఇదిలా ఉండగా శుక్రవారం ప్రభుత్వం 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఉన్నతాధికారుల బదిలీలు చేపట్టింది. 32 మంది అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# పెళ్లి కాకముందే తల్లయిన యువతి

**పుట్టిన బిడ్డను అమ్మేందుకు యత్నించి భంగపాటు**

**కరీంనగర్,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

ఈ మధ్య కాలంలో శిశువు విక్రయాలు ఎక్కువయ్యాయి. అక్రమ సంబంధం ద్వారా పుట్టిన బిడ్డను అమ్మేసేందుకు ప్రయత్నిస్తుంటారు కొందరు మహిళలు. మరికొన్ని చోట్ల బిడ్డను పోషించే స్థోమత లేక అమ్మకానికి పెట్టేస్తున్నారు. ఇఓ మహిళ కూడా ఇలాంటి దారుణానికే పాల్పడింది. అప్పుడే పుట్టిన బిడ్డను విక్రయించేందుకు ప్రయత్నించి చివరకు ఊచలులెక్కబెడుతోంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో యువతి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ యువతి ఓ వ్యక్తిని ప్రేమించింది. ప్రేమికుడి కారణంగా గర్భవతి అయిన యువతి.. మగబిడ్డకు జన్మనిచ్చింది. కానీ అతడు మోసం చేయడంతో బిడ్డను ఎలా పోషించాలో తెలియక దారుణ నిర్ణయిం తీసుకుంది. తనకు పుట్టిన బిడ్డను అమ్మకానికి పెట్టింది. ఏకంగా ఆరు లక్షలకు శిశువును విక్రయించేందుకు బేరం కుదిరింది. బిడ్డను విక్రయించేందుకు కొంతమంది మధ్యవర్తులుగా వ్యవహరించారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చాకినివానిప్లలెకి చెందిన రాయమల్లు, లత దంపతులకు శిశువు విక్రయానికి ఒప్పందం కుదిరింది. విషయం తెలిసిన బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన కరీంనగర్ టూ టౌన్ పోలీసులు.. శిశువు విక్రయాన్ని అడ్డుకున్నారు. శిశువును అమ్మేందుకు సహకరించిన 15 మందిని అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మరోమారు షాక్ ఇచ్చిన బంగారం ధరలు

**ఒక్కరోజే పది గ్రాములపై 1800 పెరుగుదల**

**హైదరాబాద్,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

బంగారం కొనాలనుకునే వారికి ధరలు వరుస షాక్‌లు ఇస్తున్నాయి. తగ్గినట్టే తగ్గి భారీగా పెరుగుతున్నాయి. బంగారం ధరలుగతం పోల్చుకుంటే శనివారం భారీగా పెరిగాయి. ఒక్క రోజులోనే ఏకంగా పది గ్రాములపై 1800 రూపాయలు పెరిగింది. శుక్రవారం పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,23,980 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 22 క్యారెట్ల బంగారం ధర 1,13,650 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 18 క్యారెట్ల ధర 92,900 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి..పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,25,840 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల ధర 1,15,350 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 18 క్యారెట్ల బంగారం ధర 94,380 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. 100 గ్రాములపై 300, కేజీపై 3 వేల రూపాయలు పెరిగింది. నిన్న(శుక్రవారం) 100 గ్రాముల వెండి ధర 16,100 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,61,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో 100 గ్రాముల వెండి ధర 16,400 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ ధర 1,64,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది.

# సురక్షిత పాఠశాలల నిర్మాణమే లక్ష్యం

**హసన్‌పర్తిలో సైబర్ క్రైమ్, బాలల హక్కుల అవగాహన కార్యక్రమం**








**హసన్‌పర్తి, నవంబర్ 22 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం నాగారంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎఫ్.ఎం.ఎం. సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో "సైబర్ క్రైమ్ నేర రహిత సురక్షిత పాఠశాల బాలల హక్కుల వారోత్సవాలు" కార్యక్రమం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో బాలల అక్రమ రవాణా నిర్మూలనపైనా అవగాహన కల్పించారు. మండల కో–ఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ మాట్లాడుతూ బాలల హక్కులు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, సైబర్ నేరాలు లేని సురక్షిత పాఠశాలలు నిర్మించాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో అపరిచితులతో సంబంధాలు, వ్యక్తిగత ఫోటోలు–వీడియోలు షేర్ చేయడం ముప్పుకు దారి తీస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్, అక్రమ రవాణా ముఠాల ప్రలోభాలకు గురికాకూడదని సూచించారు. అత్యవసర సమయంలో 1098, 100, 112, 1930, 181 టోల్ ఫ్రీ నం లు సహాయం అందిస్తాయని తెలిపారు. అధికారులు, ఉపాధ్యాయులు, మహిళా–యువజన సంఘాలు, గ్రామ ప్రజలు ఐక్యంగా కృషి చేయాలని కోరారు. విద్యార్థులు "బాలలను కాపాడండి కాపాడుదాం" అంటూ నినాదాలు చేశారు.

# జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ సత్య శారద






**వరంగల్, నవంబర్ 22 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్) అధికారిక వెబ్‌సైట్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఆవిష్కరించారు. నవంబర్ 27 నుంచి 29 వరకు ఉరుసుగుట్టలోని తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరగనున్న సైన్స్ ఫెయిర్‌కు సంబంధించిన పూర్తి సమాచారం ఒకే చోట అందుబాటులోకి వచ్చింది. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రవణ్ కుమార్ రూపొందించిన ఈ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఎగ్జిబిట్ వివరాల నమోదు, మార్గదర్శకాలు, రోజువారీ కార్యక్రమ వివరాలు, గ్రేడ్‌ట grating సూచనలు ఉన్నాయి. తెలంగాణలో ఒక సైన్స్ ఫెయిర్ కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఇదే తొలిసారి అని, ప్రభుత్వ ఉపాధ్యాయుడే రూపొందించడం గర్వకారణమని కలెక్టర్ ప్రశంసించారు. శ్రవణ్ కుమార్‌ను అభినందించారు. డీఈఓ రంగయ్య నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు. శనివారం నుంచే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెబ్‌సైట్ అందుబాటులో ఉంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సులభంగా సేవలు పొందవచ్చు.

# అల్పపీడనంతో వర్ష సూచన

**హైదరాబాద్,నవంబరు 22(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో రాగల రెండురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మలక్కా జలసంధిలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం ఉదయం 8.30 గంటలకు దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణశాఖ తెలిపింది. పశ్చిమ–వాయువ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ తర్వాతి 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో ఆదివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. పలుచోట్ల పొగమంచు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం సైతం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని వివరించింది. మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పొడి వాతావరణం ఉంటుందని వివరించింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

# ఐదేళ్లు నిద్రపోయి ఇప్పుడు లేచావా

**ఆనాడు కృష్ణాజలాల గురించి తెలియదా**

**జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి నిమ్మల**

**పాలకొల్లు,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

కృష్ణా ట్రిబ్యునల్ ఎదుట ప్రభుత్వ వాదనలపై జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఏపీ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఐదేళ్లపాటు ప్రజలు అధికారం ఇచ్చినప్పుడు ఆయన ఎక్కడ నిద్రపోయారని ప్రశ్నించారు. జలవనరులపై ఇప్పుడు ప్రదర్శిస్తున్న కపట ప్రేమ అధికారంలో ఉన్నప్పుడు ఏమైందని మండిపడ్డారు. కేవలం రాజకీయంగా పబ్బం గడుపుకునే చర్య తప్ప మరోటి కాదన్నారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఏపీ వాటాగా 512 టీఎంసీలు, తెలంగాణ వాటాగా 299 టీఎంసీలు వాడుకునే విధంగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడింది చంద్రబాబేనని గుర్తు చేశారు. 2020 లో అక్టోబర్‌లో అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఏపీ ప్రాజెక్టుల నీటి వాడకంపై పునఃసమీక్ష చేయాలని అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ కోరారు. ఆ భేటీలో జగన్ మౌనంగా ఉండి రాష్ట్రానికి అన్యాయం చేశారు. కృష్ణా జలాల ట్రిబ్యునల్-2 గెజిట్ నోటిఫికేషన్ 2023లో విడుదలైంది. అంటే అపెక్స్ కౌన్సిల్ భేటీలో తీసుకున్న నిర్ణయం ఆమోదానికి మూడేళ్లు పట్టింది. భేటీ తర్వాత మూడేళ్లపాటు జగన్ పట్టించుకోలేదు. గెజిట్ నోటిఫికేషన్‌కు ముందే సుప్రీం కోర్టులో జగన్ ఎందుకు రిట్ పిటిషన్ దాఖలు చేయలేదన్నారు. 2023 అక్టోబర్ 6న గెజిట్ నోటిఫికేషన్ వచ్చిన రోజునే ప్రధానిని కలిసి రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్లుతోందని ఎందుకు అభ్యంతరం చెప్పలేదు? 2014-19 మధ్య కాలంలో రాయలసీమకు రూ.12 వేల కోట్లు ఖర్చు పెడితే.. 2019-24 మధ్య కాలంలో కేవలం 2వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి జగన్ దగా చేశారు. 5 ఏళ్లలో చేయలేని హంద్రీనీవా పనులకోసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రూ.3860 కోట్లు ఖర్చు చేసింది. మండు వేసవిలోనూ రాయలసీమలోని జలాశయాలు జలకళతో ఉండటం చంద్రబాబు కృషికి నిదర్శనమని రామానాయుడు అన్నారు.

# పంచాయితీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ

**సిఐఐ సమ్మిట్ తరవాత ప్రపంచంలో పెరిగిన ప్రాధాన్యం**

**పెట్టుబడిదారులు ఆంధ్రా వైపు చూస్తున్నారు**

**వైసిపి నేతలు ఏం మాట్లాడుతారో తెలియదు**

**మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు**

**అమరావతి,నవంబరు 22(జై భీమ్ న్యూస్):**

విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్ తర్వాత ప్రపంచమే మన వైపు చూస్తుంది అని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. సీఐఐ సమ్మిట్ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రపంచంలోనే ప్రత్యేకంగా నిలిచింది.. వైసీపీ నేతలు రాష్ట్రంలో ఏం మాటాడుతున్నారో వాళ్లకే తెలియటం లేదు.. విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో వైసీపీ నేతలు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లు విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం వైసీపీ నేతలు ఏమి చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విశాఖ ఉక్కు కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొని వచ్చింది.. విశాఖ ఉక్కుకి సొంత గనులు లేవు.. యువ నేత నారా లోకేష్ యువగళంలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో 20 లక్షలు ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తున్నాం అన్నారు. గత ఐదేళ్లు ధాన్యం కొనుగోలు విషయంలో వైసీపీ ఏం చేసిందని మంత్రి శ్రీనివాసరావు అడిగారు. అయితే, నేడు 3 లక్షలు మెట్రిక్ టన్నులను ప్రభుత్వం కొలుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకుందని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. రైతులకు ఎక్కడ ఇబ్బందులు రాకుండా గన్నీ సంచులు తీసుకుంటే, వాళ్లకు డబ్బులను చెల్లిస్తున్నామన్నారు. రైతులకు ఎక్కడ ఇబ్బంది రాకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది.. జిల్లాలో అనేక పరిశ్రమలు వస్తున్నాయి, త్వరలో భారీగా ఉద్యోగాలు రాబోతున్నాయి.. అలాగే, త్వరలో విజయనగరంలో ఐటీ కంపెనీలు పెట్టబోతున్నారు.. రైతులు పండించిన వడ్లను రైస్ మిల్లుకు పంపించిన గంటల వ్యవధిలోనే అన్నదాతల అకౌంట్లో సొమ్ము జమ అవుతుంది అని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు వెల్లడించారు.

# పోలీసుల విచారణలో సహకరించని రవి

**విదేశీ సంస్థలపై సంబంధాలపై మౌనం**

**మూడోరోజు ముగిసిన విచారణ**

**హైదరాబాద్,నవంబరు 22(జై భీమ్ న్యూస్):**

సినిమాల పైరసీ కేసులో ఐ బొమ్మ ఇమంది రవి పోలీసుల విచారణ శనివారం మూడో రోజు ముగిసింది. ఐదు రోజుల కస్టడీలో భాగంగా ఇమంది రవికి ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీశారు. పైరసీకి ఎవరు సహకారం అందిస్తున్నారు.. తెర వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారనే విషయాలపై పోలీసులు ప్రశ్నించారు. సైబర్ నేరాలకు ఐ బొమ్మ సైట్‌ను నేరగాళ్లు వేదికగా మలుచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సినిమాల సేకరణ, సైట్‌లో అప్‌లోడ్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. అయితే, విచారణలో పోలీసులకు రవి సహకరించడం లేదని సమాచారం. పోలీసులు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు చెబుతున్నాడని తెలిసింది. యూజర్ ఐడీ, పాస్‌వర్డులు అడిగితే గుర్తు లేదు.. మరిచిపోయానని రవి సమాధానం చెప్పినట్లు సమాచారం. ఎథికల్ హ్యాకర్ల సహాయంతో హార్డ్‌డిస్క్‌లు, పెన్ డ్రైవ్‌లను పోలీసులు ఓపెన్ చేస్తున్నారు. ఫ్రాన్స్, నెదర్లాండ్‌లో మెయిన్ సర్వర్లు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. బ్యాంక్ ఖాతాల విషయంలోనూ రవి నోరువిప్పలేదని.. రవి అకౌంట్ల వివరాలు ఇవ్వాలని పలు బ్యాంకులకు పోలీసులు మెయిల్ పంపారు. ప్రతీరోజూ 20 రోజులకు ఒక్కో దేశానికి రవి వెళ్లాడని.. దీనిపై ప్రశ్నిస్తే తనకు విదేశీ పర్యటనలంటే ఇష్టమని.. అందుకే వెళ్లాలని రవి చెప్పినట్లు తెలియవచ్చింది. రవి పర్యటించిన దేశాల్లో పైరసీ లింకుల కూపీ లాగుతున్నారు పోలీసులు.

# అన్నపూర్ణ స్టూడియోను సందర్శించిన భట్టి









**ఫిల్మ్, మీడియాలో విద్యార్థుల సృజనాత్మకతకు ఫిదా**

**అక్కినేని నాగార్జున దంపతుల పట్టుదలకు అభినందన**

**హైదరాబాద్,నవంబరు 22(జై భీమ్ న్యూస్) :**

2047నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ లక్ష్యంలో చిత్ర పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ భవిష్యత్తును నిర్మించడంలో చిరంజీవి, అక్కినేని నాగార్జున వంటి సీనియర్ సినీ దిగ్గజాల మద్దతు కోసం మేము ఎదురుచూస్తున్నామని అన్నారు. మంగళవారం అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ / మీడియాను సందర్శించి విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసించారు. 1970లో కనీస మౌలిక సదుపాయాలు లేని ఈ ప్రాంతంలో దిగ్గజ అక్కినేని నాగేశ్వరరావు అన్నపూర్ణ స్టూడియోలను ఎలా స్థాపించారో, అప్పటి నుండి అది హైదరాబాద్‌లోని అత్యంత ముఖ్యమైన సాంస్కృతిక మరియు సినిమాటిక్ ల్యాండ్‌మార్క్‌లలో ఒకటిగా ఎలా ఎదిగిందో గుర్తుచేసుకుంటూ, సంస్థ యొక్క గొప్ప వారసత్వాన్ని భట్టి విక్రమార్క ప్రశంసించారు. అన్నపూర్ణ కళాశాలలో ప్రపంచ స్థాయి చలనచిత్ర విద్య ద్వారా ఈ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలో నాగార్జున అక్కినేని, అమల అక్కినేని విజన్ ను ఆయన అభినందించారు. అన్నపూర్ణ కళాశాల విద్యార్థులు రూపొందించిన రోల్ నంబర్ 52ని నేను చూశాను. నాకు ఎంతగానో నచ్చింది, మనసుని హత్తుకునే మంచి సినిమా తీసినందుకు దర్శకుడిని వారి టీమ్ ను అభినందిస్తున్నాను. అన్నపూర్ణ కళాశాలలో ఎందరో ప్రతిభావంతులు, వారి ప్రతిభ గురించి అక్కినేని నాగార్జున స్వయంగా నాతో మాట్లాడారు, అదే నన్ను ఇన్స్పైర్ చేసింది. మీ అందరిని కలవడానికే ఇక్కడికి వచ్చానని అన్నారు. అక్కినేని నాగార్జున మాట్లాడుతూ ' నా తండ్రి తెలుగు చిత్ర పరిశ్రమను చెన్నై నుండి హైదరాబాద్‌కు తరలి వచ్చినపుడు ఆయన విజన్ కు అనుగునంగా అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించబడింది. నేడు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో భారతదేశంలోని అత్యుత్తమ సంస్థలలో అన్నపూర్ణ స్టూడియోస్ ఒకటిగా నిలిచింది. అన్నపూర్ణ కళాశాల భవిష్యత్ కథకులను పెంపొందించాలనే తన కలను కొనసాగిస్తోంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ రోజు మా స్టూడియోస్ ను సందర్శించడం మాకు గౌరవంగా ఉంది. ప్రపంచ సినిమాలో తెలంగాణ వృద్ధికి మద్దతు ఇవ్వడానికి మేము ఎప్పుడు రెడీగా ఉంటామమని అన్నారు. అనంతరం డిప్యూటీ ముఖ్యమంత్రి అన్నపూర్ణ స్టూడియోస్, సౌండ్ / విజన్ భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ ఫెసిలిటీ సినిమాను కూడా సందర్శించారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలు మరియు అత్యాధునిక సాంకేతికత వివరాలు అడిగి తెల్సుకుని నాగార్జునను మెచ్చుకున్నారు.

# ప్రపంచ సంరక్షుడిగా హిందూ సమాజం

**హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ప్రమాదం**

**ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్**

ఇంఫాల్,నవంబర్22(జై భీమ్ న్యూస్): ప్రపంచాన్ని నిలబెట్టడంలో హిందూ సమాజం కీలకమని రాష్ట్రీ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ఉనికి ఉండదని పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రతి దేశం అన్ని రకాల పరిస్థితులను చూసిందని, యునాన్ (గ్రీస్) మిస్ర (ఈజిప్టు), రోమ్ వంటి సామ్రాజ్యాలు, నాగరికతలు కనుమరుగైనా హిందూ సమాజం చెక్కుచెదరలేదని చెప్పారు. జాతుల మధ్య ఘర్షణలతో ఇటీవల కాలంలో అట్టుడికిన మణిపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడుతూ, హిందూ సమాజం ధర్మానికి ప్రపంచ సంరక్షుడిగా ఉందన్నారు. భారత్ అంటే అమర నాగరికతకు పేరని, సమాజంలో అలాంటి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నందునే హిందూ కమ్యూనిటీ చెక్కుచెదరకుండా ఉందని, హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచమే ఉనికి కోల్పోతుందని అన్నారు. ఇండియాలో ఉన్నవారంతా హిందువులేనని, హిందూ వారసత్వానికి చెందినవారే ముస్లింలు, క్రిస్టియన్లని చెప్పారు. దేశ పటిష్టతకు ఆర్థిక స్వావలంభన చాలా కీలకమని మోహన్ భాగవత్ అన్నారు. దేశ నిర్మాణంలో మిలటరీ సామర్థ్యం, నాలెడ్జ్ కెపాసిటీకి సమ ప్రాధాన్యత ఉందని చెప్పారు. దేశ నిర్మాణం జరగలాంటే బలం కావాలని, బలం అంటే ఆర్థిక సామర్థ్యమని చెప్పారు. ఆధిపత్యం అనే పదానికి ఒక్కోసారి విపరీత అర్థం వస్తుందన్నారు. అయితే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఎవరిపైనా ఆధారపడకూడదని అన్నారు. ఇదేమంత కష్టమైన పని కూడా కాదని చెప్పారు. నక్సలిజం తగ్గుముఖం పట్టడంపై మాట్లాడుతూ, నక్సలిజాన్ని ఇంకెంత మాత్రం సహించేది లేదని సమాజం నిర్ణయించుకోవడమే ఇందుకు కారణమని అన్నారు. బ్రిటిష్ వారిపై జరిగిన స్వాతంత్ర్య పోరాటాన్ని ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు. 'బ్రిటిష్ సామాజ్యంలో రవి అస్తమించడు. కానీ ఇండియాలో వారి సూర్యుడు అప్పటికే అస్తమించాడు. 90 ఏళ్లపాటు ప్రయత్నాలు సాగించాం. అణచివేతకు ఎన్నడూ తలవంచలేదు. కొన్నిసార్లు మన గళం బలహీనంగా ఉండి ఉండవచ్చు, కొన్ని సార్లు బలంగా వినిపించి ఉండవచ్చు. కానీ మన గళం ఎన్నడూ మూగవోలేదు' అని మోహన్ భాగవత్ వివరించారు.

# దేశంలో పేలుళ్లకు జైషే కుట్రలు

న్యూఢిల్లీ,నవంబర్22(జై భీమ్ న్యూస్): ఢిల్లీ పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరమవుతున్న కొద్దీ పలు కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. జైషే ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ దేశవ్యాప్తంగా దాడులకు 2023 నుంచి కుట్రలు పన్నుతున్నట్టు సమాచారం ఇప్పటికే వెలుగులోకి రాగా, ఢిల్లీ పేలుడు కేసులో నిందితులుగా ఉన్న డాక్టర్లే స్వయంగా సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్‌కు నిధులు సమకూర్చినట్టు తాజాగా వెలుగుచూసింది. కేసులో నిందితులైన డాక్టర్లంతా కలిసి రూ.26 లక్షలు సమకూర్చినట్టు తెలుస్తోంది. డాక్టర్ ముజమ్మిల్ రూ.5 లక్షలు, డాక్టర్ అదిల్ అహ్మద్ రాథర్ రూ.8 లక్షలు, డాక్టర్ ముఫర్ అహ్మత్ రాథర్ రూ.6 లక్షలు, డాక్టర్ ఉమర్ రూ.2 లక్షలు, డాక్టర్ షహీన్ సాహిద్ రూ.5 లక్షలు కంటిబ్యూట్ చేసినట్టు చెబుతున్నారు. పోగుచేసిన మొత్తం సొమ్మును పేలుడు సామగ్రిని సమకూర్చేందుకు డాక్టర్ ఉమర్‌కు వీరు అందజేశారని దర్యాప్తు అధికారుల సమాచారం. అమ్మోనియం నైట్రేట్, యూరియా, ఇతర కీలక సామగ్రిని డాక్టర్ ముజమ్మిల్ సేకరించాడు. రూ.3 లక్షలతో ఎన్‌పీకే ఫెర్టిలైజర్‌ను కొనుగోలు చేశాడు. ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఫరీదాబాదాలోని రెండు మార్కెట్ల నుంచి కొన్నాడు. ఆ ఫెర్టిలైజర్‌ను పేలుడు పదార్థాలుగా డాక్టర్ ఉమర్ మహమ్మద్ మార్చాడు. పేలుడుకు అవసరమైన రసాయనాలు, రిమోట్లు, అవసరమైన పరికరాలను సమకూర్చే బాధ్యత డాక్టర్ ఉమర్ తీసుకున్నాడు. మరోవైపు, అల్-ఫయిదా యూనివర్శిటీ వ్యవహారంపై విస్తృతంగా జరిపిన ఇన్వెస్టిగేషన్‌లో ల్యాబ్ నుంచి స్టూడెంట్ ప్రాజెక్టుల పేరుతో పలు కెమికల్స్, గ్లాస్‌వేర్ చోరీ అయినట్టు తెలుస్తోంది. అమ్మోనియం నైట్రేట్, టెస్టింగ్ కిట్లు మాయమైనట్టు గుర్తించారు. నిందితులు చిన్న చిన్న మొత్తాల్లో వీటిని బ్యాగులు, వాహనాల్లో యూనివర్శిటీ నుంచి తరలించినట్టు గుర్తించారు.

# స్థానిక ఎన్నికల్లో 50శాతం మించకుండా రిజర్వేషన్లు

**పంచాయితీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్,నవంబరు 22(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చకు రేవంత్ సర్కార్ తెర దింపింది. తాజాగా ఇందుకు సంబంధించిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. రిజర్వేషన్ల ఖరారు కోసం పంచాయతీ రాజ్ శాఖ జీవో విడుదల చేసింది. పంచాయతీరాజ్ జీవో ప్రకారం రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్లు ఖరారు చేయనున్నారు. 50శాతం రిజర్వేషన్లు దాటకుండా ఎస్సీ , ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవో ప్రకారం బీసీలకు సర్పంచ్, వార్డు స్థానాల్లో 23 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి. ఇదిలావుంటే వచ్చే వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ఎన్నికల ఏర్పాట్లు, అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలు, భద్రతా చర్యలు, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సమావేశంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈసీ చర్యలు అధికార యంత్రాంగాన్ని ఉత్సాహపరుస్తున్నాయి. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నాహాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ రాణి కుమిదిని, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ.. గత ఎన్నికల నిర్వహణలో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతల నిర్వహణ సులభతరం చేయడానికి ప్రతి జిల్లాలో ఎన్నికలను మూడు దఫాలుగా నిర్వహించాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా ఒక ప్రాంతంలోని ఎన్నికలు పూర్తయిన తర్వాత, మరొక ప్రాంతంలో ఎన్నికలకు మధ్యలో రెండు రోజుల విరామం ఉండాలని డీజీపీ అభిప్రాయపడ్డారు. ఈ విరామం వలన సిబ్బందికి, భద్రతా బలగాలకు తగిన సమయం లభిస్తుందని, బందోబస్తు నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికలు పూర్తయిన రోజు ఫలితాలు సాయంత్రం ప్రకటిస్తున్న నేపథ్యంలో ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉన్నందున రెండు రోజుల విరామం అవసరమని స్పష్టం చేశారు.

# రెండేండ్ల విజయోత్సవాలు ప్రతిబింబించేలా..

**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు**
**తెలంగాణ పారిశ్రామిక విధానంపై సమగ్ర ప్రకటన**
**అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం**

**హైదరాబాద్,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ ఏరియాలో నిర్వహించే రెండు రోజుల వేడుకలను రెండేండ్ల విజయోత్సవాలుగా జరపాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్,సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు సీఎంవో అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినందున, రెండేండ్ల విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ అందరినీ ఆకట్టుకునే అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించాలని అన్నారు. డిసెంబర్ 8వ తేదీ, తొలి రోజున ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పాలన్నారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరగాలన్నారు. 9వ తేదీన రెండో రోజున తెలంగాణ భవిష్యత్తు దార్శనికతను, భవిష్యత్తు ప్రణాళికలను పొందుపరిచిన తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా రౌండ్ టేబుల్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్తు లక్ష్యాలన్ని కళ్లకు కట్టించే ఆడియో వీడియో ప్రదర్శనలు, ప్రజంటేషన్లు తయారు చేసుకోవాలని సీఎం సూచించారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, అన్ని రంగాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. వేడుకలకు వచ్చిన అతిథులకు తగిన వసతి సదుపాయాలతో పాటు అత్యున్నత భద్రత కల్పించాలని సీఎం ఆదేశించారు. ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని, అన్ని విభాగాలు సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటంతో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అన్ని విభాగాలు గ్లోబల్ సమ్మిట్లో కీలకంగా పాలుపంచుకోవాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశిరచుకోవటం, రైజింగ్ డాక్యుమెంట్లో పొందుపరిచే ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేసుకోవాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను దిశానిర్దేశం చేసే ఈ డాక్యుమెంట్లో పొందుపరిచిన అంశాలపై సంబంధిత విభాగాలతో ఈనెల 25 నుంచి వరుసగా సమీక్షలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. అభివృద్ధిలో కీలకమైన రంగాలు, అందులో పాలుపంచుకునే అనుసంధాన విభాగాలన్నింటితో ఒక్కో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లతో పాటు రెండేండ్ల ప్రగతి, తెలంగాణ రైజింగ్ 2047లో ఆయా విభాగాల పాత్రపై ప్రధానంగా సమీక్ష జరుపుతామన్నారు. ఇప్పటికే ప్రజల అభిప్రాయాలు, సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల్లోని నిపుణుల దూరదృష్టితో తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ 2047 రూపకల్పన జరిగిందని సీఎం తెలిపారు. వివిధ విభాగాల అధికారులతో నిర్వహించే సమీక్షల్లో వచ్చే విలువైన సలహాలు, నిర్దిష్టమైన సూచనలను పొందుపరిచి డాక్యుమెంట్ కు తుదిరూపం ఇస్తామని అభిప్రాయపడ్డారు.

## మహిళల ఆత్మగౌరవం ఇనుమడించే కార్యక్రమం

**ఇందిరమ్మ చీరల పంపిణీపై సలహాదారు సుదర్శన్ రెడ్డి**
**నిజామాబాద్ కలెక్టరేట్‌లో ప్రారంభం**

**నిజామాబాద్,నవంబరు 22(జై భీమ్ న్యూస్) :**

మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల సలహాదారు పీ సుదర్శన్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిజామాబాద్ కలెక్టరేట్ లో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఎలాంటి విమర్శలకు ఆస్కారం లేకుండా, తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలే కీలకమని, భవిష్యత్ తరాల బాగు కోసం పిల్లలను చక్కగా చదివించాలని హితువు పలికారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వైపు పిల్లలు పెడదారి పట్టకుండా కాపాడుకోవాలని, నిపుణులైన ఉపాధ్యాయులు, మెరుగుపడిన సదుపాయాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించాలని సూచించారు. కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో చీరల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంత మహిళలకు తొలి విడతలో చీరలను పంపిణీ చేస్తున్నారని, పట్టణ ప్రాంతాలలో మార్చి 1 నుండి వారం రోజుల పాటు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిని ప్రభుత్వం మహిళల పేరుతోనే మంజూరు చేస్తోందని, మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు. అర్హులైన వారందరికీ చీరలు పంపిణీ జరిగేలా పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, మహిళా సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో ఇసుక మాఫియా దారుణం

**చెక్ డ్యామ్‌ను కూల్చేసిన దుండగులు**

**పెద్దపల్లి,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామంలో గల చెక్ డ్యాము ను గుర్తు తెలియని దుండగులు పేల్చివేశారు. గుంపుల మానేరు వద్ద గల చెక్ డ్యాం ను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు పేల్చివేయడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. గుంపుల మానేరు పై ఉన్న చెక్ డ్యామ్ ను సుమారుగా 19 కోట్లతో నిర్మించిన ఈ చెక్ డ్యామును , వ్యవసాయ భూమికి వినియోగించుకునే నీరు సుమారు 6 వేల ఎకరాల భూమి సాగు వినియోగంలో ఉండేదని ఈ ఇసుక మాఫియా దుండగులు రాత్రి రాత్రి పేల్చి పేల్స్ వేసి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారని రైతులు ఆందోళన చెందారు. గుంపుల మానేరు ఒడ్డున ఉన్న దేవాలయానికి సుమారుగా రోజుకు 500 మంది భక్తులు వచ్చి ఇక్కడ పుణ్య స్థానాలు ఆచరించి దేవుని దర్శనం చేసుకొని వెళ్లేవారని ఈరోజు ఈ చెక్ డాం పేల్చివేయడంతో వాటర్ అంతా కిందికి వెళ్లిపోయాయని దానివల్ల భక్తులకు ఆటంకం ఇబ్బందులకు గురైనట్లుగా తెలిపారు. చెక్ డ్యామ్ ను పేల్చివేసిన ఇసుక మాఫియా దుండగులపై వెంటనే చర్యలు చేపట్టాలంటే గ్రామస్తులు కోరుతున్నారు.

## సున్నం చెరువు పునరుద్ధరణలో తొలగిన అడ్డంకి

**ఎఫ్‌టిఎల్‌లో ఉన్న గుడి, ప్రార్థనా స్థలం తరలింపునకు ఓకే**

**హైదరాబాద్,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్‌లోని సున్నం చెరువు పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తున్న హైడ్రా అధికారులు శనివారం స్థానికులతో కీలక సమావేశం నిర్వహించారు. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆంజనేయస్వామి గుడి, ముస్లింల ప్రార్థనా స్థలం 'చిల్లా' మార్పు గురించి ఇరుపక్షాల అభిప్రాయాలను హైడ్రా కమిషనర్ స్వయంగా నివాసితులతో మాట్లాడి తెలుసుకున్నారు. చెరువు పునరుజ్జీవనంలో భాగంగా ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలను గట్టు వైపు మార్చాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించగా, రెండు వర్గాల స్థానికులూ ఈ నిర్ణయానికి అంగీకారం తెలిపారు. సున్నం చెరువు కూడా హైడ్రా చేపట్టిన ప్రధాన పునరుద్ధరణ ప్రాజెక్టుల్లో ఒకటిగా ఉన్నందున, చెరువు అసలు పరిమితిని కాపాడటం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, ఆక్రమణలను తొలగించడం వంటి కార్యక్రమాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ ప్రక్రియలో ఆంజనేయుని గుడి, చిల్లా ఎఫ్‌టీఎల్‌లోకి వస్తుండటంతో, వాటి పునర్వ్యవస్థీకరణపై గత కొంతకాలంగా సమీక్ష జరుగుతోంది. శనివారం జరిగిన ఈ సమాలోచనలో ఇరువర్గాల నివాసితులు పూర్తిగా సహకరిస్తామని హైడ్రాకు హామీ ఇవ్వడం ద్వారా పెండింగ్‌లో ఉన్న సమస్యకు తెరపడింది. పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ముందుకు సాగేందుకు ఈ అంగీకారం ఎంతో సహాయకారి అవుతుందని హైడ్రా అధికారులు తెలిపారు. చెరువు భద్రత, అభివృద్ధి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యల్లో ప్రజల సహకారం అత్యంత కీలకమని కమిషనర్ సమావేశంలో పేర్కొన్నారు.

## ఎంబీఏ ఫలితాలు విడుదల

**హైదరాబాద్,నవంబరు 22(జై భీమ్ న్యూస్):**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

## తెలంగాణలో డిసిసి అధ్యక్షుల నియామకాలు

**ఎమ్మెల్యేలకు పలుచోట్ల పార్టీ అధ్యక్ష బాధ్యతలు**

న్యూఢిల్లీ,నవంబర్ 22(జై భీమ్ న్యూస్): తెలంగాణలో స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఖాళీగా ఉన్న డిసిసి పదవులను భర్తీ చేసింది. క్షేత్రసత్యాయిలో ప్రజలను సమీకరించేందుకు ఎమ్మెల్యేలకు పలుచోట్ల బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో తెలంగాణ డీసీసీలకు కొత్త అధ్యక్షులను ఏఐసీసీ ప్రకటించింది. 30 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను నియమించి వారి పేర్లను విడుదల చేసింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిధిలోని జిల్లాల కాంగ్రెస్ కమిటీలకు నూతన అధ్యక్షులను నియమిస్తూ వారి పేర్లు వెల్లడించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడి ఆమోదం మేరకు ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఇందులో ఆదిలాబాద్ - డాక్టర్ నరేష్ జాదవ్,ఆసిఫాబాద్ - ఆత్రం సుగుణ, భద్రాద్రి కొత్తగూడెం –దేవి ప్రసన్న, భువనగిరి – బీర్ల ఐలయ్య, గద్వాల – రాజీవ్ రెడ్డి, హన్మకొండ – ఇనిగాల వెంకట్రామి రెడ్డి, హైదరాబాద్ – సయ్యద్ ఖలీద్ సహిపుల్ల జగిత్యాల – నందయ్య, జనగాం – ధన్వంతి, జయశంకర్ – భూపాల పల్లి కరుణాకర్,కామారెడ్డి – మల్లికార్జున ఆలెలను నయిమించారు. ఇందులో కొందరు కార్పోరనేషన్ ఛైర్మన్లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

## మరో 11 కార్పోరేషన్లకు ఛైర్మన్ల నియామకం

**ఉత్తర్వులు జారీచేసిన కూటమి ప్రభుత్వం**

**అమరావతి,నవంబర్22(జై భీమ్ న్యూస్) :**

రాష్ట్రంలో 11 కార్పొరేషన్లకు చైర్మన్లను కూటమి ప్రభుత్వం నియమిం చింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించిన వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కళ్యాణం శివశ్రీనివాసరావు (నరసరావుపేట), ఏపీ స్టేట్ అడ్వైజరీ ఆన్ చైల్డ్ లేబర్ చైర్మన్ గా వేటుకూరి ఏవిఎస్ సత్యనారాయణ రాజు,ఏపీ అఫిషియల్ ల్యాంగ్వేజెస్ కమిషన్ చైర్మన్ గా విక్రమ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ గా మౌలానా షిబిలి (విజయవాడ),ఏపీ ఫిషర్ మెన్ కో ఆపరేటివ్ సొసైటి ఫెడ్ రేషన్ చైర్మన్ గా యాతగిరి రాంప్రసాద్ (కడప),పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటి చైర్మన్ గా చిరుమామిళ్ల మదుబాబు (మాచర్ల), ఏపీ స్టేట్ రెడ్డిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ గా కొండా శంకర్ రెడ్డి (ఇచ్చాపురం), ఏపీ కుర్ని, కరికాల భక్తుల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా మిన్నప్ప (యమ్మిగనూరు), ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ చైర్మన్ గా ముక్తియార్ (పొద్దుటూరు), ఏపీ బట్రాజు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ గా సరికొండ వెంకటేశ్వరరాజు (సత్తెనపల్లి), ఏపీ స్టేట్ పెరిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ గా వనపర్తి వీరభద్రరావు (పత్తిపాడు) నియమితులయ్యారు.

## ఢిల్లీ పేలుళ్ల కేసులో ముమ్మర దర్యాప్తు

**శ్రీనగర్‌లో మరొకరి అరెస్ట్**

**శ్రీనగర్,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ పేలుడు ఘటనలో దర్యాప్తు బృందాల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. జైషే ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కేసుకు సంబంధించి శ్రీనగర్ నివాసి ఒకరిని జమ్మూకశ్మీర్ పోలీస్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ శనివారంనాడు అరెస్టు చేసింది. బతమలూ ఏరియాకు చెందిన ఇతనిని తు÷ల్ నియాజ్ భట్‌గా గుర్తించారు. గత అక్టోబర్‌లో నౌగామ్‌లోని బన్‌పోరలో పోలీసులు, భద్రతా సిబ్బందిని బెదిరిస్తూ పోస్టర్లు వెలిసాయి. దీనిపై శ్రీనగర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించడంతో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ వెలుగు చూసింది. శ్రీనగర్ సీనియర్ ఎస్పీ డాక్టర్ జీవీ సుందీప్ చక్రవర్తి ఈ విచారణను పర్యవేక్షించి, సీసీటీవీ అనాలసిస్ చేపట్టడంతో మొదటి ముగ్గురి అనుమానితులు పట్టుబడ్డారు. ఆరిఫ్ నసీర్ దర్ అలియాస్ సాహిల్, యాసిర్ ఉల్ అష్రాఫ్, మక్సూద్ అహ్మద్ దర్ అలియా షాహిద్‌లను అరెస్టు చేశారు. వీరిని విచారించిన దర్యాప్తు సంస్థలు ఇర్ఫాన్ అమ్మద్ అనే మరో వ్యక్తిని పట్టుకున్నారు. అతను గతంలో పారామెడిక్‌గా పనిచేసి ఇమామ్‌గా మారాడని, పోస్టర్లు సరఫరా చేయడంతో పాటు డాక్టర్లను రాడికల్స్‌గా మార్చినట్టు గుర్తించారు. క్రమంలోనే ఫరీదాబాద్‌లోని అల్ ఫయిదా యూనివర్శిటీలో సోదాలు నిర్వహించారు. డాక్టర్ ముజఫర్ గనాయే, డాక్టర్ షహీన్ సయీద్‌లను అరెస్టు చేసి 2,900 కిలోల పేలుడు పదార్ధాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ గనాయ్, కారు పేలుడులో చనిపోయిన సూసైడ్ బాంబర్ ఉమర్ నబి, ముజఫర్ రాథెర్‌లతో కూడిన కోర్ గ్రూప్ ఈ పేలుడు కుట్రకు ప్రధాన కారణమని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ముజఫర్ రాథెర్ పరారీలో ఉన్నాడు.

## రాష్ట్రంలో మహిళలకు నాణ్యమైన చీరలు

### ఇందిరమ్మ చీరల పంపిణీలో మంత్రి శ్రీహరి

**మక్తల్,నవంబరు 22(జై భీమ్ న్యూస్):**

ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మక్తల్ పట్టణంలో మహిళలకు శనివారం ఇందిరమ్మ చీరలను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం మహిళలను నాణ్యమైన చీరలు అందజేస్తుందన్నారు. ప్రధానమంత్రిగా ఇందిరమ్మ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా, రాష్ట్రం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. హాస్టల్ పిల్లలకు డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. డిసెంబర్ ఒకటిన రూ.4,500 కోట్ల బడ్జెట్‌తో మక్తల్– నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని వివరించారు. మక్తల్– నారాయణపేట 4 లేన్ ల రహదారికి, నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు పాల్గొన్నారు

## సైబర్ నేరాలపై అవగాహన

**సైబర్ నేరగాళ్ల బెదిరంపులకు లొంగవద్దు**
**హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్**

**హైదరాబాద్,నవంబర్22(జై భీమ్ న్యూస్):**

సైబర్ నేరాలను అడ్డుకునేందుకు సరికొత్త కార్యక్రమానికి హైదరాబాద్ సీపీ సజ్జనార్ శ్రీకారం చుట్టారు. చార్మినార్ వద్ద నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ మీడియాతో మాట్లాడుతూ.. చారిత్రాత్మక చార్మినార్ వద్ద ప్రతి శని, మంగళవారం గడపగడపకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. చార్మినార్ వద్ద సైబర్ క్రైమ్‌పై అవేర్‌నెస్ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించే ప్రయత్నం చేశామన్నారు. అవగాహన లేక చాలామంది సైబర్ నేరాల బారిన పడుతున్నారని తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే ప్రతి రోజు కోటి రూపాయలు సైబర్ నేరాల్లో పోగొట్టుకుంటున్నారని వెల్లడించారు. ఓటీపీ ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అందరూ అవగాహన, అప్రమత్తత కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరస్తులు కాల్ చేసి బెదిరిస్తే భయపడ వద్దన్నారు. భయపడితే అది సైబర్ నేరస్తుల బలం అవుతుందని చెప్పుకొచ్చారు. ప్రైవేట్ ఫోటోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయవద్దని.. అలా చేస్తే మిమ్మల్ని ట్రాప్ చేసి మోసం చేసే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ సింబా పేరిట వాలంటరీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చామని.. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీ సజ్జనార్ పిలుపునిచ్చారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem






# అన్నిటికీ నన్ను బాధ్యుడిని చేయొద్దు

**కస్టడీలో ఐబొమ్మ రవి**

**బెట్టింగ్ యాప్స్ డబ్బుతో పైరసీ సినిమాల కొనుగోలు..**

**కరేబియన్‌లో ఆఫీస్, 20 మంది సిబ్బంది**

పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడిగా అరెస్టైన ఇమంది రవి పోలీసు కస్టడీలో కీలక విషయాలు వెల్లడిస్తున్నాడు. ఐదు రోజుల కస్టడీలో రెండో రోజైన శుక్రవారం సైబర్‌క్రైమ్ పోలీసుల విచారణలో పైరసీ నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు బయటపడ్డాయి. విచారణలో తేలిన విషయాల ప్రకారం, రవి బెట్టింగ్ యాప్‌ల ద్వారా సంపాదించిన డబ్బుతోనే 'మూవీరూల్స్' వంటి తమిళ్, హిందీ పైరసీ సైట్ల నుంచి కొత్త సినిమాలను పెద్ద ఎత్తున కొనుగోలు చేశాడు. లావాదేవీలన్నీ క్రిప్టో కరెన్సీలోనే జరిగాయి. పైరసీ కార్యకలాపాలను వ్యవస్థీకృతంగా నడపడానికి కరేబియన్ దీవుల్లో ఒక ఆఫీసు ఏర్పాటు చేసి 20 మంది ఉద్యోగులను నియమించినట్లు పోలీసులు గుర్తించారు. అయితే రవి విచారణకు పూర్తిగా సహకరించడం లేదని, చెప్పిన విషయాలనే మళ్లీ మళ్లీ రిపీట్ చేస్తున్నాడని పోలీసు వర్గాలు తెలిపాయి. "నా ద్వారా తెరుచుకున్న సైట్లు మాత్రమే మూసివేస్తాను.. అన్నిటికీ నన్ను బాధ్యుడిని చేయొద్దు" అని రవి పదేపదే అంటున్నట్లు సమాచారం. రవి అరెస్ట్ అయినా పైరసీ ఆగడం లేదు. 'ఐబొమ్మ వన్' పేరుతో కొత్త సైట్ ప్రారంభమైంది. పాత సైట్ మూవీరూల్స్‌కు రీడైరెక్ట్ అవుతోంది. ఈ నేపథ్యంలో రవిపై నమోదైన మరో నాలుగు కేసుల్లో పీటీ వారెంట్ జారీ చేసి మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు.








# హీరోయిన్లకు ఎంత టాలెంట్ ఉన్నా వేస్ట్..

**సినిమా ఇండస్ట్రీలో లింగ వివక్ష ఉంది: రాశి ఖన్నా**

**సెట్స్‌లో నటీనటులందరికీ సమాన గౌరవం దక్కాలని డిమాండ్**

టాలీవుడ్ నటి రాశి ఖన్నా సినీ ఇండస్ట్రీలో హీరో–హీరోయిన్ల మధ్య నెలకొన్న లింగ వివక్షపై స్పష్టమైన వ్యాఖ్యలు చేసి సోషల్ మీడియాలో చర్చనీయాంశం అయ్యారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన రాశి ఖన్నా, "మన దేశంలో చాలా కాలంగా హీరో వర్షిప్ కల్చర్ ఉంది. హీరోలే బాక్సాఫీస్ నడిపిస్తారని అందరూ నమ్ముతారు. అది కొంతవరకు నిజమే కావచ్చు%ా% కానీ మార్కెట్ అనేది జెండర్ మీద కాదు, టాలెంట్ మీద ఆధారపడి ఉంటుంది. హీరోయిన్‌కి ఎంత టాలెంట్ ఉన్నా చివరికి వేస్ట్ అనిపిస్తుంది" అని బాధపడ్డారు. సెట్స్‌లో నటీనటులందరికీ సమాన గౌరవం, సదుపాయాలు దక్కాలని, మహిళా నటీమణుల పట్ల ప్రవర్తనలో ఎలాంటి వివక్ష ఉండరాదని ఆమె స్పష్టం చేశారు. "తెర మీద ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలో మార్కెట్ నిర్ణయిస్తుంది%ా% కానీ సెట్ మీద మాత్రం ఆ తేడా చూపించకూడదు" అని రాశి ఒప్పుగా చెప్పారు. 'ఊహలు గుసగుసలాడే'తో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన రాశి ఖన్నా తర్వాత పలు హిట్ చిత్రాల్లో నటించారు. మధ్యలో బాలీవుడ్‌లోనూ అవకాశాలు అందుకున్న ఆమె ఇటీవల 'తెలుసా కదా'తో మళ్లీ గట్టి కమ్‌బ్యాక్ ఇచ్చారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. రాశి ఖన్నా వ్యాఖ్యలకు నెటిజన్ల నుంచి విశాలమైన మద్దతు లభిస్తోంది. ఇండస్ట్రీలో మహిళా నటీమణులకూ సమాన గౌరవం, అవకాశాలు ఇవ్వాలంటూ చాలా మంది ఆమెతో ఏకీభవిస్తున్నారు.

# షూటింగ్‌లో శ్రద్ధా కపూర్‌కు ఫ్రాక్చర్..

**'ఈతా' బయోపిక్ చిత్రీకరణ రెండు వారాలు నిలిచిపోయింది**

బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ షూటింగ్‌లో గాయపడ్డారు. ఆమె టైటిల్ రోల్‌లో నటిస్తున్న 'ఈతా' బయోపిక్ సెట్‌లో జరిగిన ప్రమాదంలో ఆమె ఎడమ కాలికి ఫ్రాక్చర్ అయింది. దీంతో సినిమా చిత్రీకరణ రెండు వారాల పాటు పూర్తిగా నిలిచిపోయింది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నాసిక్‌లో షూటింగ్ జరుగుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మిడ్–డే కథనం ప్రకారం, ఒక లావణి పాట సీక్వెన్స్ చిత్రీకరణలో వేగవంతమైన డ్యాన్స్ స్టెప్స్ వేస్తుండగా శ్రద్ధా బ్యాలెన్స్ కోల్పోయి కింద పడిపోయారు. పాత్ర కోసం 15 కిలోలకు పైగా బరువు పెంచుకున్న ఆమె నౌవారీ చీర, బరువైన ఆభరణాలు ధరించి నాట్యం చేస్తుండటంతో శరీర బరువు మొత్తం ఎడమ కాలిపై పడినట్టు తెలుస్తోంది. ప్రమాదం తర్వాత ముంబైకి తిరిగి వచ్చిన శ్రద్ధా కొన్ని ఎమోషనల్ సన్నివేశాలు షూట్ చేశారు. అయితే నొప్పి తీవ్రమవడంతో చిత్రీకరణను తాత్కాలికంగా ఆపివేశారు. శ్రద్ధా పూర్తిగా కోలుకున్న తర్వాతే మళ్లీ కెమెరా ముందుకు రాగలరని, అందుకు కనీసం రెండు వారాల సమయం పడుతుందని చిత్ర బృందం తెలిపింది. ఈ విషయంపై శ్రద్ధా కపూర్ ఇంకా సోషల్ మీడియాలో స్పందించలేదు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ తమాషా కళాకారిణి, 'తమాషా సామ్రాజ్ఞి'గా పేరుగాంచిన విఠాబాయి నారాయణగావ్కర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. 1957, 1990లో రాష్ట్రపతి అవార్డులు అందుకున్న ఆమె జానపద నృత్య రంగానికి చేసిన సేవలు ఈ చిత్రంలో కనిపించనున్నాయి.

# ఐబొమ్మ రవి కేసు దర్యాప్తు అధికారిణి డీసీపీ దారా కవిత వరంగల్ బదిలీ

**ఐబొమ్మ రవి పైరసీ కేసు దర్యాప్తు చేస్తున్న సైబర్‌క్రైమ్ డీసీపీ దారా కవితను వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా బదిలీ చేశారు. కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఆమె బదిలీ గమనార్హంగా మారింది. కవిత స్థానంలో హైదరాబాద్ సైబర్‌క్రైమ్ డీసీపీగా అరవింద్ బాబు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ వై.వీ. సుచేంద్రను ఎస్టీ డీసీపీగా నియమించారు. తెలంగాణ హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో మరో ఆరుగురు నాన్-కేడర్ ఎస్పీలకు కూడా బదిలీలు జరిగాయి: పెద్దపల్లి డీసీపీ పి. కరుణాకర్ ? ఇంటెలిజెన్స్ ఎస్పీ.. సైబరాబాద్ ఎస్టీ డీసీపీ బి. సాయిశ్రీ ? తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ .. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఎస్.వీ.ఎన్. శివరాం ? ఏసీబీ ఎస్పీ..ట్రాన్స్‌కో ఎస్పీ జగదీశ్వర్ రెడ్డి ? ఇంటెలిజెన్స్ విభాగం.. ఇంటెలిజెన్స్ ఎస్పీ రవీందర్ రెడ్డి ? గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్.. అడిషనల్ కమిషనర్ అశోక్ కుమార్ ? సీఐడీ ఎస్పీ.**